పోరు తెలంగాణ
పత్రిక ప్రకటనల కోసం
మరియు
చందాదారులుగా
చేరండి చేర్పించండి
వివరాలకు
సంప్రదించండి సెల్
8555918136

పోరు తెలంగాణ
డిజిటల్ తెలుగు దినపత్రిక




కరీంనగర్ సంపుటి : 11 సంచిక : 322 మంగళవారం 29-09-2026 ఎడిటర్ : కొండ ప్రవీణ్ కుమార్ పేజీలు : 04 వెల : 04

# మన్మోహన్‌కు 'భారతరత్న' ఇవ్వాలి




మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' ప్రకటించాలని తెలంగాణ

- ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి
- హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహావిష్కరణ
- పీవీ, మన్మోహన్ వల్లే దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉందని వ్యాఖ్య
- మౌనాన్ని భాషగా మార్చి గొప్ప పాలన అందించారని ప్రశంస

## సిరిసిల్ల వెళుతున్న రేవంత్ రెడ్డికి
# కేటీఆర్ బహిరంగ లేఖ



- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిరిసిల్ల పర్యటనకు ముందు కేటీఆర్ బహిరంగ లేఖ
- 8 వేల ఎకరాల భూమి ఆరోపణలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్
- నేతన్నల బకాయిలు చెల్లించి, నిలిచిన పథకాలు పునరుద్ధరించాలని ప్రశ్న
- రైతు బంధు, రుణమాఫీ హామీల అమలుపై స్పష్టత ఇవ్వాలని కోరిన కేటీఆర్
- కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు తేదీలను ప్రకటించాలని నిలదీత

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన - మిగతా 2 లో

# ప్రభుత్వం కీలక ప్రకటన

## కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ పనులు

- ★ కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు రంగం సిద్ధం
- ★ అక్టోబర్ 5న సీడబ్ల్యూసీకి డిజైన్లు సమర్పించనున్న అధికారులు
- ★ నవంబర్ రెండో వారం నుంచి పనులు ప్రారంభం
- ★ భద్రత, నాణ్యతలో రాజీ లేదన్న మంత్రి ఉత్తమ్
- ★ 2027 వర్షాకాలం నాటికి పూర్తి చేయాలని లక్ష్యం



కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులు నవంబర్ రెండో వారంలో ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. హైదరాబాద్‌లో ఇరిగేషన్ ఉన్నతాధికారులతో - మిగతా 2 లో

# అక్టోబరు 12 నుంచి శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు

- అక్టోబరు 12 నుంచి 20 వరకు శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు
- అధికమాసం కారణంగా ఈ ఏడాది రెండోసారి బ్రహ్మోత్సవాల నిర్వహణ
- అక్టోబరు 16న గరుడ వాహనం, 19న స్వర్ణరథం, 20న చక్రస్నానం
- ధ్వజారోహణం, ధ్వజావరోహణం లేకుండా జరగనున్న ఉత్సవాలు
- వాహన సేవల పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేసిన టీటీడీ



కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమల క్షేత్రంలో నవరాత్రి - మిగతా 2 లో

# పల్లె పండుగ 3.0

- ఈ నెల 29న రామాపురంలో చంద్రబాబు, పవన్ పర్యటన
- ఈ నెల 29న 'పల్లె పండుగ 3.0' కార్యక్రమం ప్రారంభం
- నెల్లూరు జిల్లా రామాపురంలో సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్ పర్యటన
- గ్రామాల అభివృద్ధి కోసం రూ.10 వేల కోట్ల నిధుల కేటాయింపు
- పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే
- సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పిలుపు




## హార్మూజ్‌కు 'ట్రంప్ జలసంధి' అని పేరు పెట్టిన ట్రంప్

ఇరాన్ ప్రతిపాదన తిరస్కరణ



- హర్మూజ్ జలసంధిని తెరిచేందుకు ఇరాన్ చేసిన ప్రతిపాదన తిరస్కరణ
- ఆంక్షలు ఎత్తివేస్తే ఏడు రోజుల్లో రాకపోకలు పునరుద్ధరిస్తామన్న ఇరాన్
- ఇరాన్‌ను అణుబాంబును సొంతం చేసుకోనివ్వబోమని స్పష్టం చేసిన ట్రంప్
- ఇరు దేశాల మధ్య ప్రతిష్టంభనతో కొనసాగుతున్న ఉద్రిక్తతలు

అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు - మిగతా 2 లో

## ఉగ్రవాదానికి కేరాఫ్ పాకిస్థాన్
# ఉగ్రవాదంతో స్నేహం కుదరదు

- ఉగ్రవాదానికి పాక్ కేరాఫ్ అడ్రస్‌గా మారిందని ఐరాసలో జైశంకర్ విమర్శ
- 'ఆపరేషన్ సిందూర్'పై పాక్ పీఎం షెహబాజ్ షరీఫ్ ఆరోపణలకు కౌంటర్
- ఉగ్రవాదాన్ని ఆపితేనే సంబంధాలు మెరుగుపడతాయని స్పష్టీకరణ




- ఆపరేషన్ నిలిపివేతలో ట్రంప్ జోక్యం చేసుకున్నారన్న పాక్ వాదన
- పాక్ డీజీఎంఓ అభ్యర్థన మేరకే ఆపరేషన్‌ను నిలిపివేశామని భారత్ వెల్లడి

# ప్రభుత్వం కీలక ప్రకటన

మొదటిపేజీ తరువాయి – నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పనుల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. బ్యారేజీల పునరుద్ధరణకు సంబంధించిన డిజైన్లను అక్టోబర్ 5న కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) సాంకేతిక పర్యవేక్షణ కమిటీకి సమర్పించనున్నట్లు మంత్రి తెలిపారు. కేంద్రం నుంచి అవసరమైన సాంకేతిక అనుమతులు లభించిన వెంటనే పనులు మొదలుపెడతామని స్పష్టం చేశారు. 2027 వర్షాకాలం నాటికి ఈ మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. బ్యారేజీల భద్రత, నాణ్యత విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) సహా నిపుణుల కమిటీలు లేవనెత్తిన అభ్యంతరాలను, సూచనలను పరిగణనలోకి తీసుకున్నామని, జాతీయ స్థాయి సాంకేతిక సంస్థల సిఫార్సుల మేరకే పనులు చేపడతామని వెల్లడించారు. ఈ మూడు బ్యారేజీల భద్రతను పటిష్ఠం చేసి, వాటి పూర్తి సామర్థ్యాన్ని పునరుద్ధరించడమే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని ఆయన ఈ సమావేశంలో నొక్కిచెప్పారు.

## అక్టోబరు 12 నుంచి శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు

మొదటిపేజీ తరువాయి – బ్రహ్మోత్సవాలకు ముహూర్తం ఖరారైంది. అక్టోబరు 12 నుంచి 20వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు ఈ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు విడుదల చేశారు. ఇటీవలే టీటీడీ శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు దసరా బ్రహ్మోత్సవాలకు సన్నద్ధమవుతోంది. చాంద్రమానం ప్రకారం ప్రతి మూడేళ్లకోసారి వచ్చే అధికమాసం కారణంగా ఈ ఏడాది స్వామివారికి రెండోసారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే కన్యామాసంలో సాలకట్ల బ్రహ్మోత్సవాలు జరగగా, దసరా నవరాత్రులను పురస్కరించుకుని ఆశ్వయుజ మాసంలో నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయతీ. ఈ నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ధ్వజారోహణం, పెద్ద రథం, ధ్వజావరోహణం ఉండవని టీటీడీ స్పష్టం చేసింది.

ఉత్సవాల్లో భాగంగా స్వామివారు ప్రతిరోజూ ఉదయం, రాత్రి వేళల్లో వివిధ వాహనాలపై మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. అక్టోబరు 16న అత్యంత కీలకమైన గరుడ వాహన సేవ, అక్టోబరు 19న స్వర్ణరథం, అక్టోబరు 20న చక్రస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయి.

సాధారణంగా ఉదయం వాహన సేవలు 8 నుంచి 10 గంటల వరకు, రాత్రి సేవలు 7 నుంచి 9 గంటల వరకు జరుగుతాయి. అయితే, గరుడ వాహన సేవ మాత్రం అక్టోబరు 16న సాయంత్రం 6:30 గంటల నుంచి రాత్రి 11:30 గంటల వరకు కన్నుల పండువగా జరగనుంది.

నవరాత్రి బ్రహ్మోత్సవాల వాహన సేవల పూర్తి షెడ్యూల్:

అక్టోబరు 11: అంకురార్పణం (రాత్రి 7 నుంచి 9 గంటల వరకు)

అక్టోబరు 12: బంగారు తిరుచ్చి ఉత్సవం (ఉదయం 9 గంటలకు), పెద్దశేష వాహనం (రాత్రి 7 గంటలకు)

అక్టోబరు 13: చిన్నశేష వాహనం (ఉదయం 8 గంటలకు), హంస వాహనం (రాత్రి 7 గంటలకు)

అక్టోబరు 14: సింహ వాహనం (ఉదయం 8 గంటలకు), ముత్యపుపందిరి వాహనం (రాత్రి 7 గంటలకు)

అక్టోబరు 15: కల్పవృక్ష వాహనం (ఉదయం 8 గంటలకు), సర్వభూపాల వాహనం (రాత్రి 7 గంటలకు)

అక్టోబరు 16: మోహినీ అవతారం (ఉదయం 8 గంటలకు), గరుడ వాహనం (సాయంత్రం 6:30 గంటలకు)

అక్టోబరు 17: హనుమంత వాహనం (ఉదయం 8 గంటలకు), పుష్పక విమానం (సాయంత్రం 4 గంటలకు), గజ వాహనం (రాత్రి 7 గంటలకు)

అక్టోబరు 18: సూర్యప్రభ వాహనం (ఉదయం 8 గంటలకు), చంద్రప్రభ వాహనం (రాత్రి 7 గంటలకు)

అక్టోబరు 19: స్వర్ణరథం (ఉదయం 7 గంటలకు), అశ్వ వాహనం (రాత్రి 7 గంటలకు)

అక్టోబరు 20: చక్రస్నానం (ఉదయం 6 గంటలకు)

అక్టోబరు 20వ తేదీ ఉదయం జరిగే చక్రస్నానంతో ఈ నవరాత్రి బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం కానున్నాయి. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది.

## పల్లె పండుగ 3.0

మొదటిపేజీ తరువాయి – రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'పల్లె పండుగ 3.0' కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. ఈ నెల 29న నెల్లూరు జిల్లా, ఉదయగిరి నియోజకవర్గంలోని రామాపురంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. వీరి పర్యటనతో రామాపురంలో సందడి వాతావరణం నెలకొంది. రాష్ట్రంలోని పల్లెల రూపురేఖలను సమూలంగా మార్చాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. దీని కోసం రాష్ట్రవ్యాప్తంగా రూ.10,000 కోట్ల భారీ బడ్జెట్‌ను ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధులతో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడం, పారిశుధ్యం మెరుగుపరచడం, తాగునీటి సౌకర్యం, రహదారుల నిర్మాణం వంటి కీలక పనులను చేపట్టనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా పంచాయతీ గ్రాంట్లు, గ్రామీణాభివృద్ధి పథకాలకు పెద్దపీట వేయనున్నట్లు తెలుస్తోంది. సీఎం, డిప్యూటీ సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. సభా ప్రాంగణం, భద్రతా చర్యలు, పార్కింగ్ సౌకర్యాలను నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేశ్ స్వయంగా పర్యవేక్షించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కూటమి నేతలు సమాయత్తమవుతున్నారు. కోవూరు టీడీపీ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ, ఉదయగిరి నియోజకవర్గంలోని జనసేన, బీజేపీ నాయకులతో సమావేశమై ప్రజా సమీకరణపై చర్చించినట్లు తెలిపారు. "ప్రభుత్వం చేపడుతున్న ఈ మహత్తర కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి. సెప్టెంబరు 29న రామాపురం గ్రామానికి భారీగా తరలివచ్చి 'పల్లె పండుగ 3.0'ను విజయవంతం చేయాలి" అని ఆమె ప్రజలను కోరారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ఇరాన్ ప్రతిపాదన తిరస్కరణ.. హర్మూజ్‌కు 'ట్రంప్ జలసంధి' అని పేరు పెట్టిన ట్రంప్

మొదటిపేజీ తరువాయి – మరోసారి భగ్గుమన్నాయి. వ్యూహాత్మక హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు ఇరాన్ చేసిన ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిరస్కరించారు. అంతేకాకుండా, ఆ జలమార్గానికి 'ట్రంప్ జలసంధి' అని పేరు పెడుతూ సోషల్ మీడియాలో ఒక మ్యాప్‌ను పోస్ట్ చేసి వివాదాన్ని మరింత పెంచారు. అంతకుముందు, న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి సమావేశంలో మధ్యవర్తుల ద్వారా ఇరాన్ ఒక ప్రతిపాదనను అమెరికా ముందుంచింది. తమ ఓడరేవులపై అమెరికా విధించిన నావికా దిగ్బంధనాన్ని ఎత్తివేయడం, స్తంభింపజేసిన ఆస్తులను విడుదల చేయడం, చమురు అమ్మకాలపై ఆంక్షలను సడలించడం వంటి షరతులకు అంగీకరిస్తే.. ఏడు రోజుల్లో హర్మూజ్ జలసంధిలో రాకపోకలను పునరుద్ధరిస్తామని తెలిపింది. అమెరికా అంగీకరించిన ఆరో రోజు నాటికి జలసంధిని తెరుస్తామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి వివరించారు. అయితే, ఈ ప్రతిపాదనను ట్రంప్ తోసిపుచ్చారు. ఇరాన్ మాట నిలబెట్టుకుంటుందన్న నమ్మకం లేదని, టెహ్రాన్ అణ్వాయుధాన్ని సంపాదించకుండా అడ్డుకుంటామని ఆయన స్పష్టం చేసినట్లు అమెరికా అధికారులు తెలిపారు. ఆ తర్వాతే 'ట్రంప్ జలసంధి' పేరుతో ఉన్న మ్యాప్‌ను తన ట్రూత్ సోషల్ ఖాతాలో పంచుకున్నారు. గతంలో ఆగస్టులో కూడా ట్రంప్ ఈ జలసంధిని 'అమెరికా కొత్త భూభాగం'గా పేర్కొనడం గమనార్హం. ప్రపంచ ఇంధన సరఫరాలకు హర్మూజ్ జలసంధి అత్యంత కీలకం. ఈ ఏడాది ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ చర్యల తర్వాత ఈ మార్గంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తాజా పరిణామాలతో ఇరు దేశాల మధ్య ప్రతిష్ఠంభన కొనసాగుతోంది.

## వంద శాతం ఇథనాల్ కారు.. లీటర్‌కు రూ. 25 ఖర్చే: నితిన్ గడ్కరీ



వంద శాతం ఇథనాల్‌తో నడిచే కార్లు వస్తున్నాయన్న గడ్కరీ లీటర్ పెట్రోల్‌కు రూ. 25 ఖర్చుతో సమానమని వెల్లడి అక్టోబర్‌లో టయోటా 100 శాతం ఇథనాల్ ఇన్నోవా విడుదల పెట్రోల్ లేకుండా నడుస్తూనే 60 శాతం విద్యుత్ ఉత్పత్తి

# మన్మోహన్‌కు 'భారతరత్న' ఇవ్వాలి: ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

మొదటిపేజీ తరువాయి – ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, విప్రో సర్కిల్ వద్ద మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, మౌనాన్ని తన భాషగా మార్చుకుని, దేశానికి అద్భుతమైన పాలన అందించిన గొప్ప రాజనీతిజ్ఞుడు మన్మోహన్ సింగ్ అని కొనియాడారు. అంతటి మహనీయుడికి భారతరత్న ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వానికి ఉన్న అభ్యంతరం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చొరవ తీసుకుని మన్మోహన్ సింగ్‌ను భారతరత్నతో సత్కరించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీలకు అతీతంగా మేధావులను గౌరవించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు మన్మోహన్ సింగ్ బాధ్యతలు చేపట్టారని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్‌ల దార్శనికత వల్లే దేశంలో ఆర్థిక సంస్కరణలు వచ్చాయని, దాని ఫలితంగానే నేడు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటివి రూపుదిద్దుకున్నాయని పేర్కొన్నారు. భూసేకరణ చట్టాన్ని తీసుకువచ్చి, భూనిర్వాసితుల అంగీకారాన్ని తప్పనిసరి చేసిన ఘనత మన్మోహన్ సింగ్ ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. మన్మోహన్ సింగ్ జీవితం నేటి 'జెన్-జెడ్' సహా అన్ని తరాలకు స్ఫూర్తిదాయకమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ, రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల వెళుతున్న రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ

మొదటిపేజీ తరువాయి – దాదాపు మూడేళ్ల తర్వాత తొలిసారిగా సిరిసిల్ల నియోజకవర్గానికి వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, స్థానిక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నలతో స్వాగతం పలికారు. కేవలం రాజకీయ విమర్శలు, వ్యక్తిగత దూషణలకు పరిమితం కాకుండా, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు, ప్రభుత్వం ఇచ్చిన హామీలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ సుదీర్ఘమైన బహిరంగ లేఖను విడుదల చేశారు.

### 8 వేల ఎకరాల భూమిపై శ్వేతపత్రం ఏది?

అసెంబ్లీలో సీఎం చేసిన ఆరోపణలను ప్రస్తావిస్తూ, సిరిసిల్లలో బీఆర్ఎస్ నేతలు 8 వేల ఎకరాల భూమిని దోచుకున్నారని, అందులో 2,400 ఎకరాలు స్వాధీనం చేసుకున్నామని చెప్పడం నిరాధారమని కేటీఆర్ అన్నారు. 2014 నుంచి 2023 వరకు జిల్లాలో కేవలం 1,272 ఎకరాల భూ పంపిణీ జరిగిందని, అందులో సిరిసిల్ల నియోజకవర్గంలో 204 ఎకరాలు మాత్రమేనని స్పష్టం చేశారు. "ఆ 8 వేల ఎకరాల భూమి ఎక్కడుంది? స్వాధీనం చేసుకున్న 2,400 ఎకరాలు ఏ మండలం, ఏ గ్రామం, ఏ సర్వే నంబర్‌లో ఉన్నాయి? ఆ వివరాలతో తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలి. రుజువు చేయలేకపోతే సిరిసిల్ల ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

### నేతన్నల బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారు?

బీఆర్ఎస్ హయాంలో బతుకమ్మ చీరలు, స్కూల్ యూనిఫాంలు, ఇతర ప్రభుత్వ ఆర్డర్లతో నేతన్నలకు రూ.3,313 కోట్ల విలువైన పని కల్పించి, వారి ఆదాయాన్ని రూ.20 వేలకు పెంచామని కేటీఆర్ గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల పథకాన్ని నిలిపివేసి, ఇతర ఆర్డర్లను దళారులకు కట్టబెట్టి నేతన్నల ఉపాధిని దెబ్బతీసిందని ఆరోపించారు. "నేతన్నల బకాయిలు రూ.60 కోట్లు ఎప్పుడు చెల్లిస్తారు? నిలిపివేసిన 10% యార్న్ సబ్సిడీ, రూ.5 లక్షల నేతన్న బీమా ఎప్పుడు పునరుద్ధరిస్తారు? తేదీలు ప్రకటించాలి" అని ప్రశ్నించారు. వీవింగ్ పార్క్, అపరెల్ పార్క్ ప్రారంభించి కార్మికులను యజమానులుగా మార్చే ప్రణాళికలను ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని నిలదీశారు.

### రైతన్నకు ఇచ్చిన మాట ఏమైంది?

రైతుబంధును రూ.15 వేలకు పెంచుతామని, కౌలు రైతులకు కూడా ఇస్తామని హామీ ఇచ్చి ఎందుకు అమలు చేయడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. "ఎగ్గొట్టిన రైతుబంధు బకాయిలు, రూ.2 లక్షల రుణమాఫీ సంపూర్ణ అమలు, నిలిచిపోయిన రైతుబీమా పునరుద్ధరణ ఎప్పుడు చేస్తారు? స్పష్టమైన తేదీలు ప్రకటించాలి" అని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో రూ.1,604 కోట్లతో చేపట్టిన మల్కపేట రిజర్వాయర్ నుంచి అప్పర్ మానేరుకు నీటిని ఎప్పుడు తరలిస్తారో చెప్పాలన్నారు.

### అభివృద్ధి, విద్య, సంక్షేమంపై ప్రశ్నల వర్షం

బీఆర్ఎస్ హయాంలో సిరిసిల్లను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చామని, రూ.400 కోట్లతో మంజూరైన జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కాలేజీకి నిధులు ఎందుకు విడుదల చేయడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. రూ.1,564 కోట్లతో సిరిసిల్ల పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన రూ.40 కోట్ల బకాయిలు విడుదల చేయాలని కోరారు. ఆసరా పెన్షన్లను రూ.4 వేలకు ఎప్పుడు పెంచుతారని, 33 నెలలుగా మహిళలకు బాకీ ఉన్న రూ.82,500 మహాలక్ష్మి సాయం, కల్యాణలక్ష్మి తులం బంగారం హామీ ఏమైందని నిలదీశారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థినులకు స్కూటీలు, ఆటో డ్రైవర్లకు రూ.12 వేల సాయం వంటి హామీల అమలుపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చే హామీ, నిలిపివేసిన గొర్రెల పంపిణీ, చేపపిల్లల పంపిణీ, దళితబంధు, బీసీబంధు పథకాలను ఎప్పుడు పునరుద్ధరిస్తారో చెప్పాలని కోరారు. చైతన్యానికి ప్రతీక అయిన సిరిసిల్ల గడ్డపైకి వస్తున్న ముఖ్యమంత్రి, ప్రజల పక్షాన తాము లేవనెత్తిన ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం చెప్పి, తన పర్యటనకు సార్థకత చేకూర్చాలని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు.

# నేపాల్‌లో జల ప్రళయం.. 547కి చేరిన మృతుల సంఖ్య



మొదటిపేజీ తరువాయి – వందలాది మంది ఇప్పటికీ గల్లంతయ్యారని, వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. భోటేకోషి నదిలో నీటిమట్టం ప్రమాదకర స్థాయిలో పెరుగుతుండటంతో మళ్లీ వరదలు వచ్చే ప్రమాదం ఉందని, ఈ కారణంగా సహాయక బృందాలు అత్యంత జాగ్రత్తగా ముందుకు సాగుతున్నాయి. రసువా జిల్లాలో వరదల నుంచి ప్రాణాలతో బయటపడిన కస్టమ్స్ ఏజెంట్ రాజు బుధతోకి మాట్లాడుతూ, "భూమి ఒక్కసారిగా కంపించినట్లు అనిపించింది. కళ్ళు తెరిచేలోపే వరద నీరు ఉవ్వెత్తున ఎగిసిపడి ఇళ్లను తుడిచిపెట్టేసింది. ఈ ప్రమాదం నుంచి బయటపడటం నాకు పునర్జన్మ లాంటిది" అని ఆ భయానక క్షణాలను గుర్తుచేసుకున్నారు. ఈ విపత్తు ప్రభావం చైనా వైపున ఉన్న టిబెట్‌పైనా తీవ్రంగా పడింది. నేపాల్ సరిహద్దులోని పోర్టు వద్ద సంభవించిన వరదల్లో ఐదుగురు మరణించగా, 260 మంది విదేశీయులతో సహా 558 మంది గల్లంతయ్యారని చైనా అధికారులు ప్రకటించారు. ఈ ఘటనపై చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కమ్యూనిస్ట్ పార్టీ అత్యవసర సమావేశం నిర్వహించి సహాయక చర్యలపై సమీక్షించారు. నేపాల్‌లోని ఎత్తైన హిమానీనదం (గ్లేసియర్) ఒకటి కూలిపోవడం వల్లే ఈ విపత్తు సంభవించి ఉండవచ్చని చైనా ప్రాథమికంగా అంచనా వేస్తోంది. ఖాట్మండులోని శాస్త్రవేత్తలు కూడా ఇదే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. హిమానీనదం కూలిపోవడం, మంచు-రాళ్ల చరియలు విరిగిపడటంతో లెండే నదికి తాత్కాలికంగా ఆనకట్టలా అడ్డుపడిందని, అది ఒక్కసారిగా తెగిపోవడంతో, అక్కడ్నించి భోటేకోషి నదిలోకి ఈ స్థాయిలో వరద ప్రవాహం దూసుకొచ్చిందని భావిస్తున్నారు. ఈ పెను విషాదంపై అంతర్జాతీయ సమాజం స్పందిస్తోంది. నేపాల్ ప్రధాని బాలేంద్ర షా, ఆయన కేబినెట్ మంత్రులు తమ ఒక నెల జీతాన్ని విపత్తు సహాయ నిధికి విరాళంగా ప్రకటించారు. ఖాట్మండులోని మహాకాళ్ శని భగవాన్ ఆలయంలో బాధితుల ఆత్మశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వరదల్లో చిక్కుకున్న భారత పర్యాటకులను భారత రాయబారి నవీన్ శ్రీవాస్తవ కలిసి ధైర్యం చెప్పారు. యునైటెడ్ కింగ్‌డమ్ 5 మిలియన్ పౌండ్ల ఆర్థిక సహాయంతో పాటు, అత్యవసర సహాయక బృందాలను పంపడానికి ముందుకొచ్చింది. గల్లంతైన వారిలో సుమారు 33 మంది బ్రిటిష్ పౌరులు ఉన్నట్లు సమాచారం. సరిహద్దుల్లో అంతర్జాతీయ సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

# నేపాల్ వరదలు.. ఏపీ, తెలంగాణకు చెందిన 29 మంది గల్లంతు

మొదటిపేజీ తరువాయి – నేపాల్ వరదల్లో చిక్కుకున్న తెలుగు రాష్ట్రాల యాత్రికులు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు, తెలంగాణకు చెందిన 22 మంది గల్లంతుయాత్రికుల భద్రతపై చంద్రబాబు, రేవంత్ రెడ్డి సమీక్షలుబాధితుల సహాయం కోసం ఢిల్లీలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుకేంద్ర ప్రభుత్వం, రాయబార కార్యాలయాలతో సమన్వయంనేపాల్‌ను ముంచెత్తిన ఆకస్మిక వరదలు కైలాస మానస సరోవర యాత్రకు వెళ్లిన తెలుగు రాష్ట్రాల యాత్రికులను తీవ్ర కష్టాల్లోకి నెట్టాయి. ఈ విపత్తు కారణంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు, తెలంగాణకు చెందిన 22 మందితో సహా మొత్తం 29 మంది ఆచూకీ ఇంకా లభించలేదని అధికారులు గురువారం తెలిపారు. వీరిని సురక్షితంగా వెనక్కి తీసుకురావడానికి ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు యాత్రికుల ఆచూకీ తెలియరాలేదని, మరో 34 మంది సురక్షితంగా ఉన్నారని అధికారులు వెల్లడించారు. కర్నూలు-ఆదోనికి చెందిన నలుగురు టిబెట్‌లో క్షేమంగా ఉండగా, తిరుపతి ప్రాంతానికి చెందిన 28 మంది యాత్రికులు ఖాట్మండులో సురక్షితంగా ఉన్నట్లు రియల్-టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) ద్వారా సంప్రదించి నిర్ధారించుకున్నారు. గల్లంతైన ఏడుగురిలో చిత్తూరు, విజయవాడ, కాకినాడ, గుంటూరుకు చెందిన వారున్నారు. వీరిలో ముగ్గురు ఈశా ఫౌండేషన్ నిర్వహించిన యాత్రలో పాల్గొన్నారని, వారి ఫోన్లు స్విచ్ ఆఫ్ వస్తున్నాయని తెలిపారు. ఈ పరిణామాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వరదల్లో చిక్కుకున్న వారిని సురక్షితంగా తీసుకురావడమే ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. బాధితుల వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకుని, వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం, ఖాట్మండు, చైనాలలోని భారత రాయబార కార్యాలయాలతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని సూచించారు. రోడ్డు, వాయు మార్గాల పునరుద్ధరణతో పాటు, అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా యాత్రికులను తరలించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సహాయక చర్యల కోసం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. తెలంగాణకు చెందిన 22 మంది యాత్రికుల ఆచూకీ ఇంకా తెలియాల్సి ఉందని రాష్ట్ర ప్రభుత్వ అధికారులు తెలిపారు. మొదట 23 మంది గల్లంతైనట్లు భావించినా, రంగారెడ్డి జిల్లాకు చెందిన ఒక యాత్రికుడు తన కుటుంబంతో మాట్లాడటంతో అతను సురక్షితంగా ఉన్నట్లు తేలింది. గల్లంతైన వారిలో ఆరుగురు తెలంగాణకు చెందినవారు కాగా, 17 మంది తెలంగాణ మూలాలున్న ఎన్నారైలు. వీరిలో చాలామంది నేపాల్-టిబెట్ సరిహద్దులోని రసువా, రసువాగధి, గైరాంగ్ వంటి ప్రాంతాల్లో ఉన్నట్లు చివరిసారిగా తెలిసిందని అధికారులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఢిల్లీలోని తెలంగాణ భవన్, హైదరాబాద్‌లోని సచివాలయంలో హెల్ప్‌లైన్‌లను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు దాదాపు 80-100 కాల్స్ వచ్చినట్లు తెలిపారు. తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ స్వయంగా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. కేంద్ర విదేశాంగ శాఖ, భారత రాయబార కార్యాలయాలతో సమన్వయం చేసుకుంటూ గల్లంతైన వారిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. బాధితుల కుటుంబాలు, ట్రావెల్ ఆపరేటర్ల నుంచి వచ్చిన సమాచారాన్ని ధ్రువీకరించుకుంటూ సహాయక చర్యలను వేగవంతం చేసినట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.



# ఉగ్రవాదానికి కేరాఫ్ పాకిస్థాన్ ఉగ్రవాదంతో స్నేహం కుదరదు



మొదటిపేజీ తరువాయి – ఐక్యరాజ్యసమితి (ఐరాస) సాధారణ సభ వేదికగా భారత్, పాకిస్థాన్‌ల మధ్య మరోసారి మాటల యుద్ధం చోటుచేసుకుంది. పాకిస్థాన్ 'నిరంతర ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడే దేశం' అని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నిన్న 81వ ఐరాస సాధారణ సభలో ఆయన ప్రసంగిస్తూ, అంతకుముందు రోజు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చేసిన ప్రసంగంలోని వాస్తవాలను వక్రీకరించారని దుయ్యబట్టారు. పాకిస్థాన్ పేరును నేరుగా ప్రస్తావించకుండా.. "నిన్న, ఉగ్రవాదాన్ని అలవాటుగా మార్చుకున్న ఒక దేశం ఈ సభ ముందు వాస్తవాలను వక్రీకరించింది. ఉగ్రవాదాన్ని సాధారణీకరించేందుకు, దాని పరిణామాల నుంచి తప్పించుకోవడానికి వాదనలు వినిపించింది. అది కుదరదు. ఉగ్రవాదం నుంచి మమ్మల్ని మేము రక్షించుకునే హక్కును వినియోగించుకుంటాం. ఉగ్రవాదం, స్నేహం కలిసి కొనసాగలేవు" అని జైశంకర్ స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే వారే తమ పద్ధతులు మార్చుకోవాలని ఆయన హితవు పలికారు. శుక్రవారం తన ప్రసంగంలో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్.. గత ఏడాది మే నెలలో భారత్ నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్'ను 'తప్పుడు సాకుతో చేసిన బాహ్య దురాక్రమణ'గా అభివర్ణించారు. ఐరాస చార్టర్‌లోని ఆర్టికల్ 51 ప్రకారం తమ సైన్యం ఆత్మరక్షణ కోసమే ప్రతిదాడి చేసిందని, శత్రువుకు ఎప్పటికీ మరిచిపోలేని గుణపాఠం చెప్పిందని పాక్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్‌ను, సైన్యాన్ని ప్రశంసించారు. ఆపరేషన్‌ను నిలిపివేయడంలో సకాలంలో జోక్యం చేసుకున్నందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆ తర్వాత ట్రంప్ కూడా ఈ ప్రసంగంలోని 87 సెకన్ల క్లిప్‌ను ఎలాంటి వ్యాఖ్య లేకుండా తన ట్రూత్ సోషల్ ఖాతాలో పంచుకున్నారు.అయితే, పాక్ వాదనలను భారత్ తీవ్రంగా ఖండించింది. గత ఏడాది ఏప్రిల్ 22న పహల్గామ్‌లో 26 మంది పౌరుల మరణానికి కారణమైన ఉగ్రదాడికి ప్రతీకారంగానే, మే 7న పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై 'ఆపరేషన్ సిందూర్' ప్రారంభించినట్లు భారత్ గుర్తుచేసింది. ట్రంప్ జోక్యం వల్లే ఆపరేషన్ ఆగిందన్న వాదనలో నిజం లేదని, పాకిస్థాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ) తమ భారత ప్రతిరూపానికి చేసిన అభ్యర్థన మేరకే ఆపరేషన్‌ను తాత్కాలికంగా నిలిపివేసినట్లు న్యూఢిల్లీ స్పష్టం చేసింది.

## గుంతల దారి నుంచి బస్సు బాటకు గ్రామీణ ప్రయాణానికి కొత్త ఊపిరి



**పోరు తెలంగాణ నెక్కొండ, సెప్టెంబర్ 28 :** బస్సు వస్తే చాలు.. రోడ్డు ఎలా ఉన్నా మేము చూసుకుంటా మంటూ గ్రామాలు ఒక్కటయ్యాయి. నెక్కొండ మండలంలోని పలు గ్రామాల మీదుగా నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు సర్వీసు పునఃప్రారంభానికి మార్గం సుగమమైంది. ఈ బస్సు సర్వీసు పునరుద్ధరణ కోసం అంబాల రామగోపాల్ చేసిన కృషికి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, ఆర్టీసీ అధికారులు పూర్తిగా సహకరించారు. బస్సు మార్గంలో ఉన్న చెట్లు, ముళ్లపొదలు తొలగించడం, గుంతలు పూడ్చడం, రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని ఆయా గ్రామాల సర్పంచులు, యువజన సంఘాలు, మహిళా సంఘాలు స్వయంగా బాధ్యత తీసుకున్నాయి. ఈ సర్వీసు పునరుద్ధరణకు అన్ని రాజకీయ పక్షాల నాయకులు కూడా సంపూర్ణంగా సహకరించడం విశేషం. ప్రజా అవసరం ముందు రాజకీయ భేదాలను పక్కనపెట్టి గ్రామాలన్నీ కలిసి చేసిన ఈ ప్రయత్నం.. కేవలం బస్సు సర్వీసుతో పాటు గ్రామాల ఐక్యతకు కూడా కొత్త బాట వేసిందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## కిసాన్ నగర్ అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాస కార్యక్రమం నిర్వహణ



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** బాల్కొండ మండలంలోని కిసాన్ నగర్ అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాస కార్యక్రమం నిర్వహించారు.ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం చేపట్టారు.పోషణ ప్రతిజ్ఞ చేయించారు. పిల్లల సంపూర్ణ ఎదుగుదలతో పాటు,శారీరక,మానసిక వికాసంపై అవగాహన కల్పించారు.సర్పంచ్ రామ్ రాజ్ గౌడ్, వార్డు సభ్యుడు ఐలాపురం శ్రీనివాస్,అంగన్వాడీ టీచర్లు విజయ,సుజాత, లక్ష్మి,ఆశ వర్కర్లు గర్భిణీలు,పిల్ల తల్లులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాల్కొండలో ఘనంగా భగత్ సింగ్ జయంతి వేడుకలు

### స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ త్యాగాలు,పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శం ప్రధానోపాధ్యాయులు బట్టు రాజేశ్వర్



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాల్కొండలో స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ వీరుడు షహీద్ భగత్ సింగ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.భగత్ సింగ్ కేవలం ఒక విప్లవ వీరుడే కాకుండా,సామాజిక సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం పట్ల అపారమైన నిబద్ధత కలిగిన మహనీయుడని పేర్కొన్నారు.నేటి యువత ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని క్రమశిక్షణ, నైతిక విలువలు, సేవాభావం, దేశభక్తి వంటి ఉన్నత లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు.దేశ అభివృద్ధిలో భాగస్వాములవుతూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు.భగత్ సింగ్ ఆశయాలను ఆచరణలో పెట్టడం,దేశ సమగ్రతను కాపాడడం, సమాజ శ్రేయస్సు కోసం కృషి చేయడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి అని ప్రధానోపాధ్యాయులు బట్టు రాజేశ్వర్ పేర్కొన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి భావాలను పెంపొందించడంలో ఇటువంటి జయంతి వేడుకలు ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు వేల్పూర్ శ్రీనివాస్, మురళి,ఉపాధ్యాయులు,భగత్ సింగ్ యువసేన సభ్యులు,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని భగత్ సింగ్‌కు ఘనంగా నివాళులర్పించారు.

## 2 లక్షల 20 వేల ఎన్ ఓ సి అందజేసిన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** బాల్కొండ మండలం కిసాన్ నగర్ గ్రామానికి చెందిన మాగాణి రాములు కిడ్నీ సామాజిక వ్యాధితో హైదరాబాదులో చికిత్స పొందుతున్నారు. వైద్యులు చూపిస్తా చేయాలని సూచించడంతో వైద్య ఖర్చుల కోసం కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 2 లక్షల 20 వేల ఎల్ఓసి అందజేశారు. అనంతరం తమ కుటుంబానికి కొండంత అండగా నిలిచిన ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బాల్కొండ మండల టిఆర్ఎస్ అధ్యక్షులు ప్రవీణ్ రెడ్డి, సర్పంచ్ రామరాజు గౌడ్ పాల్గొన్నారు.

## ఘనంగా షహీద్ భగత్ సింగ్ 119వ జయంతి వేడుకలు



**మహేశ్వరం, సెప్టెంబర్ 28, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) కందుకూరు మండల సమితి ఆధ్వర్యంలో షహీద్ భగత్ సింగ్ 119వ జయంతి వేడుకలను కందుకూరు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొమ్మగళ్ళ రాజు సిపిఐ పార్టీ కందుకూరు మండల కార్యదర్శి హాజరై భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భగత్ సింగ్ దేశ స్వాతంత్ర్యం కోసం 23 ఏళ్ల చిన్న వయసులోనే తృణపాయంగా ప్రాణత్యాగం చేసిన మహనీయుడు. ఆయన అతని ఆశయం కేవలం బ్రిటిష్ వారిని తరిమికొట్టడం మాత్రమే కాదు, దోపిడీ లేని సోషలిస్టు సమాజాన్ని నిర్మించడం నేటి యువత భగత్ సింగ్ స్ఫూర్తితో దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడటానికి ముందుకు రావాలి అని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రవీణ్ కందుకూరు మండల కార్యదర్శి, కవిత సహాయ కార్యదర్శి, జంగయ్య, రాములు, మహమ్మద్ సిరాజ్ పాల్గొన్నారు.

# కరుణాకర్ మృతదేహాన్ని స్వదేశానికి తెప్పించాలి

### తక్షణమే ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలి: నాయకపోడు జిల్లా అధ్యక్షుడు గాండ్ల రామచందర్



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** ఉపాధి కోసం దుబాయ్ వెళ్లిన ఆలూర్ మండలానికి చెందిన ఆటో డ్రైవర్ గడ్డం చరణ్ కరుణాకర్ ప్రమాదవశాత్తు మృతి చెందడంతో ఆయన మృతదేహాన్ని తక్షణమే స్వదేశానికి తీసుకురావాలని నాయకపోడు జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గాండ్ల రామచందర్ ప్రభుత్వాన్ని కోరారు.ఆటో డ్రైవర్గా ఉపాధి అవకాశాలు లేక కుటుంబానికి మెరుగైన భవిష్యత్తు కల్పించాలనే ఆశతో కరుణాకర్ దుబాయ్ వెళ్లారని, అయితే అక్కడికి వెళ్లిన వారం రోజుల్లోనే ప్రమాదవశాత్తు మృతి చెందడం తీవ్ర విషాదకరమన్నారు. ఉపాధి కోసం విదేశాలకు వెళ్లాల్సిన పరిస్థితులు రాకుండా ప్రభుత్వం స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కరుణాకర్ కుటుంబ సభ్యులను నాయకపోడు సంఘం జిల్లా సభ్యులతో కలిసి రామచందర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరుణాకర్ మృతదేహాన్ని వీలైనంత త్వరగా భారతదేశానికి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం వెంటనే ఆర్థిక సాయం ప్రకటించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.అలాగే ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ స్పందించి కరుణాకర్ మృతదేహాన్ని స్వదేశానికి తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపట్టడంతో పాటు బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. నాయకపోడు సంఘం సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని రామచందర్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో నాయకపోడు సంఘం సభ్యులు దుంపల శ్రీనివాస్,మంతెన భూమన్న,పుట్ట కిరణ్, కుందాపురం నవీన్,ఇంగు ముత్తన్న, రవి,ఒడ్డన్న, ప్రమోద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# గ్యానేష్ కుమార్ రాజీనామా చేయాలి

### ఓట్ల చోరీకి పాల్పడుతున్న కేంద్రం..
### ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్..
### రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు పారిజాత నరసింహారెడ్డి..

**మహేశ్వరం, సెప్టెంబర్ 28, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** కేంద్ర ఎన్నికల అధికారి తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కేంద్ర ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ కందుకూరు మండల కేంద్రంలో రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షురాలు పారిజాత నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కేంద్ర ప్రభుత్వం తీరును నిరసిస్తూ భారీ నిరసన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సచిన్ సావంత్ మాట్లాడుతూ.. ఓటు హక్కు ప్రతి పౌరుడి జన్మ హక్కు అని అన్నారు. ఎన్నికల వ్యవస్థ పై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉండాలంటే ఎన్నికల సంఘం పారదర్శకంగా పనిచేయాలని ఆయన సూచించారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను భారత పౌరులకు దక్కే వరకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం బిజెపికి అనుకూలంగా వ్యవహరిస్తుందని ఆయన ఆరోపించారు. బిజెపి ప్రభుత్వం కేంద్రంలో మరోసారి రావడానికి భారీ కుట్ర పన్నుతుందని ఆయన ఆందోళన వ్యక్తపరిచారు. అర్హులైన వారి ఓట్లను బిజెపి కుట్ర పూరితంగా తొలగించడం చేస్తుందని మండిపడ్డారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను కేంద్రం హరించివేయడం సిగ్గుచేటైన విషయం అని అన్నారు.




### పేదలకు న్యాయం జరిగే వరకూ పోరాటం..
### కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నరసింహారెడ్డి..

రాజ్యాంగం కల్పించిన హక్కులను కేంద్రం హరించివేయడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. రాజ్యాంగబద్ధమైన పదవులలో ఉంటూ భారత రాజ్యాంగాన్ని కించపరిచే విధంగా వ్యవహరించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ పక్షాన పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోడీ, ఎన్నికల సంఘం అధికారి గ్యానేష్ కుమార్ ల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి, చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జ్



భీమ్ భరత్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రామ్మోహన్ రెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, టి యు ఎఫ్ ఐ డి సి చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, మాజీ జడ్పీ చైర్పర్సన్ అనిత రెడ్డి, రామ్మోహన్ గౌడ్, మహేశ్వరం, కందుకూరు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వట్టెల మల్లేష్ యాదవ్, రాణా ప్రతాప్ రెడ్డి, మహేశ్వరం సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు నేనావత్ రాజు నాయక్, సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, కల్వకుర్తి, ఆమనగల్, రాజేంద్ర నగర్, ఇబ్రహీంపట్నం, నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంబేద్కర్ యువజన సంఘాలను బలోపేతం చేయాలి

### ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ కో-ఆర్డినేటర్ వరుణ్ కుమార్..

**మహేశ్వరం, సెప్టెంబర్ 28, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** జిల్లాలలో అంబేద్కర్ యువజన సంఘాలను బలోపేతం చేయాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ కో-ఆర్డినేటర్ ఎస్. వరుణ్ కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్ లోని అంబేద్కర్ రిసార్ట్ సెంటర్ లో జరిగిన 50 సంవత్సరాల స్వర్ణోత్సవ ప్రతినిధుల మహాసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేద్కర్ యువజన సంఘాలను బలోపేతం చేసే దిశగా ఆయన యువజన సంఘాల నాయకులు దిశా నిర్దేశం చేశారు. గతంలో అంబేద్కర్ సంఘంలో పనిచేసిన వారు అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ నాయకుల స్ఫూర్తిని స్మరించుకున్నారు. అనంతరం దళితుల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుండి వచ్చిన ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీని నూతనంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కడారం వినయ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా బొంకూరి మధు, సెక్రటరీ జనరల్ గా జయప్రకాష్, కోశాధికారిగా దుప్పాడ అప్పారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కర్క నాగరాజ్, రాజేష్, సందీప్ ఉపాధ్యక్షులుగా బ్యాగరి రాజు, ప్రభు, ప్రమోద్, కుమార్ కాన్పల్లి సతీష్, రాష్ట్ర కార్యదర్శిగా సిద్దార్థ, మంజుల, బాల రాజేశం, రామయ్య, సంపత్, లతా శ్రీ, శాంకారి రాష్ట్ర సమితి కార్యదర్శులుగా నాగర్జున, కుమారస్వామి రవి ప్రసాద్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కమిటీలను పూర్తిగా రద్దు చేయడం జరిగిందని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. మామిడిపల్లి బాపయ్య ను జాతీయ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా, జాతీయ కార్యదర్శిగా కొంకటి లక్ష్మణ్ కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా



ఎన్నికైన కాడారం వినయ్ కుమార్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో రెండవసారి అధ్యక్ష పదవిని ఇచ్చినందుకు రాష్ట్రంలో అంబేద్కర్ యువజన సంఘాన్ని పటిష్ట పరుస్తానని తెలిపారు. నా నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఇల్లందు క్రాస్‌రోడ్‌లో పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలి

### వేలాది మంది ప్రయాణికుల ఇబ్బందులు పట్టించుకోరా?
### గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన బంజారా సంఘాల జేఏసీ

**కొత్తగూడెం ఆర్సీ/పాల్వంచ, సెప్టెంబర్ 28(పోరు తెలంగాణ ప్రతినిధి,జివిరత్నం):** లక్ష్మీదేవిపల్లి మండలం ఇల్లందు క్రాస్‌రోడ్ వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని కోరుతూ భద్రాద్రి కొత్తగూడెం బంజారా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో సోమవారం గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ బానోత్ వీరునాయక్ మాట్లాడుతూ.. ఇల్లందు క్రాస్‌రోడ్ జాతీయ రహదారులను అనుసంధానించే ప్రధాన కూడలిగా ఉండటంతో ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. పాల్వంచ, భద్రాచలం, మణుగూరు, టేకులపల్లి, ఇల్లందు, మహబూబాబాద్, వరంగల్, కొత్తగూడెం, ఖమ్మం తదితర ప్రాంతాలకు ఈ కూడలి కీలక కేంద్రంగా మారిందన్నారు. ఇల్లందు నుంచి పాల్వంచ వైపు, పాల్వంచ నుంచి ఇల్లందు వైపు వెళ్లే ప్రయాణికులు కొత్తగూడెం బస్టాండ్‌కు వెళ్లకుండా ఇల్లందు క్రాస్‌రోడ్ వద్ద ఆర్టీసీ బస్సులు, ఆటోలు మారాల్సి వస్తుందని తెలిపారు. బస్సులు, ఆటోల కోసం ప్రయాణికులు కొంత సమయం వేచి ఉండాల్సి వస్తుండగా, అత్యవసర సమయంలో వినియోగించుకునేందుకు కనీసం పబ్లిక్ టాయిలెట్ సదుపాయం కూడా లేకపోవడం తీవ్ర ఇబ్బందికరంగా మారిందని పేర్కొన్నారు. ముఖ్యంగా



మహిళలు, వృద్ధులు, చిన్నారులు టాయిలెట్ సౌకర్యం లేక తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ ఆర్టీసీ బస్టాప్‌తో పాటు ఆటోస్టాండ్, పలు ఆలయాలు, వ్యవసాయ చెక్‌పోస్ట్, పండ్ల దుకాణాలు, హోటళ్లు ఉండటంతో ప్రజల రద్దీ మరింతగా ఉంటుందని తెలిపారు. ప్రజల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ఇల్లందు క్రాస్‌రోడ్‌లో ప్రభుత్వ నిధులతో వెంటనే పబ్లిక్ టాయిలెట్లను నిర్మించి, వాటి నిర్వహణకు శాశ్వత చర్యలు చేపట్టాలని బంజారా సంఘాల జేఏసీ, ఆటో యూనియన్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలకు అత్యవసరమైన మౌలిక సదుపాయాల్లో మరుగుదొడ్లు కూడా ఒక భాగమేనని, ముఖ్యంగా మహిళల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు ఈ అంశంపై తక్షణమే స్పందించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా నాయకులు గుగులోత్ కేశవ నాయక్, బానోత్ రమేష్ నాయక్, గుగులోత్ భద్రు నాయక్, ఇస్లావత్ అనిల్ నాయక్, ధరావత్ మురళి నాయక్, ఆటో యూనియన్ అధ్యక్షుడు నాని, నాయకులు భాస్కర్, కార్తీక్, అనిల్ తదితరులతో పాటు పలువురు ప్రయాణికులు పాల్గొన్నారు.

# నవభారత్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపుపై వివాదం

### 380 మంది పాత లబ్ధిదారుల హక్కులను కాపాడాలి: కాంపెల్లి కనకేష్ పటేల్

**కొత్తగూడెం ఆర్సీ/పాల్వంచ, సెప్టెంబర్ 28(పోరు తెలంగాణ ప్రతినిధి,జివిరత్నం):** పట్టణంలోని నవభారత్ ప్రాంతంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపుపై నెలకొన్న వివాదాన్ని పరిష్కరించి, గతంలో ఎంపికైన 380 మంది పేద కుటుంబాలకు న్యాయం చేయాలని పాల్వంచ కో-ఆపరేటివ్ సొసైటీ ఉపాధ్యక్షులు కాంపెల్లి కనకేష్ పటేల్ డిమాండ్ చేశారు. సోమవారం పాల్వంచ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023లో 1,976 మంది అర్హులను పరిశీలించిన అనంతరం అధికారుల సమక్షంలో డ్రా నిర్వహించి 380 మందిని ఎంపిక చేసి స్లిప్పులు అందజేశారని, వారి పేర్లను తహసీల్దార్ కార్యాలయ నోటీస్ బోర్డులో ప్రదర్శించారని తెలిపారు. అయితే ఇటీవల 360 మందికి కొత్తగా డ్రా నిర్వహించడం వల్ల గతంలో ఎంపికైన పేద కుటుంబాల్లో ఆందోళన నెలకొందన్నారు. గతంలో ఎంపికైన లబ్ధిదారులను పక్కన పెట్టకుండా, అర్హతపై సందేహాలు ఉంటే పారదర్శకంగా విచారణ నిర్వహించాలని




కోరారు. నవభారత్‌లో నిర్మించిన ఇళ్ల సంఖ్య, గతంలో ఎంపికైన 380 మంది, తాజాగా ఎంపిక చేసిన 360 మంది వివరాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాత లబ్ధిదారులకు న్యాయం చేయడంతో పాటు, కొత్త డ్రా ప్రక్రియపై సమగ్ర వివరణ ఇవ్వాలని ఆయన కోరారు. సమస్యను అధికారులు తక్షణమే పరిష్కరించకపోతే బాధితులతో కలిసి న్యాయపోరాటం చేస్తామని, అవసరమైతే తెలంగాణ హైకోర్టును ఆశ్రయిస్తామని కాంపెల్లి కనకేష్ పటేల్ తెలిపారు. ఈ సమావేశంలో మారుమూళ్ల కిరణ్, పూజల ప్రసాద్, కాంపెల్లి నవీన్, కదలి సత్యనారాయణ, గుగులోతు శ్యామ్ కుమార్, కాంపెల్లి భార్గవ్ నితీష్, కదలి రామకృష్ణ, గజేంద్రుల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలి

### కలెక్టరేట్ వద్ద ధర్నాలో తుర్రంవారిగూడెం సర్పంచ్, ఉపసర్పంచ్ డిమాండ్

**భద్రాద్రి కొత్తగూడెం,(పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గం ప్రతినిధి-వల్లెపోగు రాము)అశ్వాపురం సెప్టెంబర్ 28:-** భారతదేశంలోని 140 కోట్ల మంది ప్రజల ప్రాణంతో సమానమైన ప్రజాస్వామ్య వ్యవస్థకు,దానికి వెన్నెముక లాంటి ఓటు హక్కుకు విఘాతం కలిగిస్తూ..ఓటు హక్కును సమాధి చేస్తున్న కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలి" అని తుర్రంవారిగూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్ కుంజ జూన్ మరియు ఉపసర్పంచ్ ధారావత్ హర్ష నాయక్ డిమాండ్ చేశారు. నేడు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిర్వహించిన మహా ధర్నా కార్యక్రమంలో తుర్రంవారిగూడెం సర్పంచ్, ఉపసర్పంచ్ లతో పాటు ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాజ్యాంగం పౌరులందరికీ ప్రసాదించిన అమూల్యమైన ఓటు హక్కును మరియు ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో ఎన్నికల కమిషన్ పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. పారదర్శకంగా జరగాల్సిన ఎన్నికల ప్రక్రియను, ప్రజాస్వామ్య సూత్రాలను కాలరాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వేచ్ఛాయుతమైన, నిష్పాక్షికమైన ఎన్నికలు నిర్వహించలేని వ్యక్తి ఆ పదవిలో కొనసాగే అర్హత లేదని, వెంటనే ఆయన తప్పుకోవాలని స్పష్టం చేశారు.



# ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను సస్పెండ్ చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ, కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ మహాధర్నా



**కొత్తగూడెం సెప్టెంబర్ 28 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** కేంద్ర ఎన్నికల సంఘం భ్రష్టు పట్టిందని, కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి ఎఐసిసి, టి.పిసిసి, భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవిప్రసన్నలి పిలుపు మేరకు ఆమె ఆధ్వర్యంలో వేలాది మంది కాంగ్రెస్ శ్రేణులు కలెక్టరేట్ వద్ద ధర్నా చౌక్ లో ధర్నా చేసి, భారీ ప్రదర్శనగా వెళ్ళి జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న, వైరా శాసనసభ సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ లతో పాటు కొత్వాలశ్రీను కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైరా లిఎమ్మెల్యే మాలోత్ రామదాస్ నాయక్ డిసిసి దేవి ప్రసన్న మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం, బి.జె.పి పార్టీ స్వంత సొత్తుగా మారింది, తొత్తుగా వ్యవహరిస్తున్నదనీ, సర్ ప్రోగ్రాం పేరుతో లక్షలాది మంది ఓట్లను తొలగించే కుటిల యత్నాలు చేస్తున్నదని అన్నారు.ఎన్నికల సంఘం కేంద్ర ప్రభుత్వం తొత్తుగా వ్యవహరిస్తున్నదని, లక్షలాది మంది బి.జె.పి యేతర పార్టీల ఓట్లను తొలగిస్తున్నదని, జ్ఞానేశ్వర్ కుమార్‌ను వెంటనే తొలగించి, అరెస్టు చేయాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ డిసిసి దేవిప్రసన్నలి డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీని ప్రధానిని చేసేవరకు కాంగ్రెస్‌శ్రేణులు విశ్రమించరాదు ఏఐసిసి అగ్రనేత రాహుల్‌గాంధీని ప్రధానిని చేసేవరకు కాంగ్రెస్ కార్యకర్తలు విశ్రమించవద్దని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి ప్రచారం చేయాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు ఈ కార్యక్రమంలో కొత్తగూడెం కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి జిల్లా కార్యదర్శి వారాల వేణు నాగ సీత రాములు బూర్గంపాడు మణుగూరు అశ్వాపురం మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలపల్లి సుధాకర్ రెడ్డి పినపాక పట్టి నగర్ సర్పంచ్ బానోత్ పద్మ జిల్లాలోని ఉన్న కాంగ్రెస్ పార్టీ సర్పంచులు భారీ ఎత్తున పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి నిరసన తెలిపారు వేలాదిమంది కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాజీనామా చేయాలి

### జ్ఞానేష్ కుమార్‌ను సస్పెండ్ చేసి అరెస్టు చేయాలి: కొత్వాల

### కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ ధర్నా..

### కలెక్టర్‌కు వినతిపత్రం





**కొత్తగూడెం ఆర్సీ/పాల్వంచ, సెప్టెంబర్ 28(పోరు తెలంగాణ ప్రతినిధి,జివిరత్నం):** కేంద్ర ఎన్నికల సంఘం పనితీరుపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో విమర్శలు చేసింది. ఎన్నికల సంఘం కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ, కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం ప్రదర్శనగా కలెక్టరేట్‌కు చేరుకుని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల సంఘం బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. 'ఎస్ఐఆర్' కార్యక్రమం పేరుతో లక్షలాది మంది ఓటర్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. బీజేపీయేతర పార్టీలకు చెందిన ఓట్లను తొలగిస్తున్నారనే ఆరోపణలపై ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే సస్పెండ్ చేసి, అరెస్టు చేయాలని కొత్వాల డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలబెట్టేందుకు ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు.

**రాహుల్‌గాంధీని ప్రధానిని చేసేవరకు విశ్రమించొద్దు**

ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేసేవరకు కాంగ్రెస్ శ్రేణులు విశ్రమించవద్దని కొత్వాల పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, కొత్వాల శ్రీనివాసరావుతో పాటు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఓటు హక్కును కాలరాస్తున్న ఈసీ వైఖరిని వ్యతిరేకించాలి

### ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి

### కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ శ్రేణుల ధర్నా..

### కలెక్టర్‌కు మెమోరాండం



**కొత్తగూడెం ఆర్సీ/పాల్వంచ, సెప్టెంబర్ 28(పోరు తెలంగాణ ప్రతినిధి,జివిరత్నం) :** దేశంలోని సామాన్యులు, నిరక్షరాస్యులైన ప్రజల ఓటు హక్కుకు భంగం కలిగించేలా కేంద్ర ఎన్నికల సంఘం తీసుకుంటున్న నిర్ణయాలను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ శ్రేణులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఆధ్వర్యంలో 'ఎస్ఐఆర్' కార్యక్రమం పేరుతో వివిధ రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాలపై చేపడుతున్న చర్యల వల్ల సామాన్య ప్రజలు అయోమయానికి గురవుతున్నారని ఆరోపించారు. సరైన అవగాహన, అవసరమైన పత్రాలు లేని నిరుపేదలు, నిరక్షరాస్యులు తమ ఓటు హక్కును కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నమ్మకం ఉండాల్సిన అవసరం ఉందని, ఓటర్ల జాబితా సవరణ పేరుతో అర్హులైన పౌరుల ఓటు హక్కు తొలగించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో పారదర్శకతను పాటించాలని కోరారు. ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కుల్లో కీలకమైనదని, అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ప్రజలను అయోమయానికి గురిచేస్తున్న నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని, ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాస్, 46వ డివిజన్ కార్పొరేటర్ విమలాదేవి, 47వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వాసుమల్ల సుందర్రావు, చింత నాగరాజు, మార్కెట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ నరిగే సుజాత, ఓలపల్లి రాంబాబు, సుజాత, గడివేసి ప్రభాకర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**పోరు తెలంగాణ మంచిర్యాల,సెప్టెంబర్ 28, 2026 :** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జైపూర్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన సుందిళ్ల రాజయ్య తనకు చెందిన పట్టా భూమి నిషేధిత జాబితాలో ఉందని, సవరించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కవ్వాల్ ఫిషర్మెన్ కో- ఆపరేటివ్ సొసైటీ సభ్యులు తమ సంఘంలో అనర్హులను తొలగించి అర్హత కలిగిన వారికి సభ్యత్వం కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాసిపేట మండలం కోమటిచేను గ్రామానికి చెందిన జాడి అనసూర్య తన భర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని, జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కొరకు దరఖాస్తు చేసుకున్నానని, కాగా తన దరఖాస్తు కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాకు వెళ్లిందని, మంచిర్యాల జిల్లాకు మార్పు చేసి పథకం ప్రయోజనం అందించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి పట్టణంలోని అంబేద్కర్ నగర్ కు చెందిన ఆలేటి భాగ్యలక్ష్మి తనకు ఇందిరమ్మ ఇల్లు పథకం వర్తింపచేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కాజీపేట మండలం సోమగూడెం ట్యాంక్ బస్తీకి చెందిన భుక్యా జ్యోతి కాజీపేట ఓపెన్ కాస్ట్ లో తన భూమి కోల్పోయానని, ఎంజాయ్మెంట్ సర్వేలో తన పేరు వచ్చినప్పటికీ కొందరు వ్యక్తులు తన పేరును తొలగించారని, ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. దండేపల్లి మండలం రెబ్బెనపల్లి గ్రామానికి చెందిన తౌట సువర్ణ తనకు గ్రామ శివారులో భూమి ఉందని, రిజిస్టర్డ్ కొనుగోలు దస్తావేజు ద్వారా నేను కొనుగోలు చేసిన భూమిని కొందరు అక్రమంగా ఆక్రమించుకుని దౌర్జన్యానికి పాల్పడుతున్నారని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దండేపల్లి మండలం మేదరిపేట గ్రామానికి చెందిన షేక్ తాజుద్దీన్ తమ గ్రామంలోని బస్టాండు సమీపంలో అమర్చిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ కు సంబంధించి విద్యుత్ తీగలు తెగిపడడం, అగ్గి రవ్వలు రావడంతో స్థానిక ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఈ విషయమై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. చెన్నూర్ మండలం కొమ్మెర గ్రామానికి చెందిన నోముల సుప్రజ తాను ఎం పి హెచ్ డబ్ల్యు పూర్తి చేశానని, తనకు చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరోగ్య కార్యకర్తగా ఉపాధి అవకాశం కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణం జాఫర్ నగర్ ప్రాంతానికి చెందిన నసీం బేగం తన ఇంటి ప్రాంతంలో పారిశుధ్యం, మురుగు కాలువ శుభ్రతపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. నస్పూర్ మండలం శ్రీరాంపూర్ కు చెందిన బొడ్డుపల్లి రజిత తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరై చివరి విడత ఫోటో అప్లోడ్ చేయడం జరిగిందని, బిల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్హత గల లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో 49 దరఖాస్తులు అందాయని, ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి అధికారుల సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చీమల వారి దశదిన కర్మలలో పాల్గొన్న మాజీ ప్రభుత్వ విప్ రేగా కాంతారావు





**భద్రాద్రి కొత్తగూడెం,పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గ ప్రతినిధి-వల్లెపోగు రాము)మణుగూరు సెప్టెంబర్ 28:-** మండలంలోని బాంబే కాలనీ గోల్డెన్ ఫంక్షన్ హాల్ నందు బాపనుకుంటకు చెందిన చీమల భద్రమ్మ దశదినకర్మలకు హాజరై చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పినపాక మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మణుగూరు మండల అధ్యక్షులు కుర్రి నాగేశ్వరరావు గారు, మణుగూరు టౌన్ అధ్యక్షులు కుంట లక్ష్మణ్ గారు, శ్రీవిద్య అధినేత నూకరాపు రమేష్ గారు, మణుగూరు ఏస్సి సెల్ అధ్యక్షులు సురేష్ గారు,బీసీ సెల్ అధ్యక్షులు అక్కి నరసింహారావు గారు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వట్టం రాంబాబు గారు, ఆవుల నరసన్న, ముద్దంగుల కృష్ణ,యువ నాయకులు గుర్రం సృజన్ రాజ్, జక్కం రంజిత్, సూర్య, సురేష్ తదితరులు హాజరై కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## గణేష్ లడ్డును కైవసం చేసుకున్న ఎలుగని రమేష్ గౌడ్



**మహేశ్వరం, సెప్టెంబర్ 28, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** గొల్లూరు గ్రామంలో ప్రతిభ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథుని వేలంపాటలో గొల్లూరు గ్రామ ఉపసర్పంచ్ ఎలుగని రమేష్ గౌడ్ 67 వేల రూపాయలకు వేలంపాటను పాడి కైవసం చేసుకున్నారు. గణనాథుని ఆశీస్సులు గ్రామ ప్రజలపై ఉండాలని ఎల్లప్పుడు ఉండాలని ఆయన వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 2 లక్షల 20 వేల ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** బాల్కొండ మండలం కిసాన్ నగర్ గ్రామానికి చెందిన మాగాణి రాములు కిడ్నీ సంబంధిత వ్యాధితో హైదరాబాదులో చికిత్స పొందుతున్నారు. వైద్యులు చూపిస్తా చేయాలని సూచించడంతో వైద్య ఖర్చుల కోసం కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 2 లక్షల 20 వేల ఎల్ఓసి అందజేశారు. అనంతరం తమ కుటుంబానికి కొండంత అండగా నిలిచిన ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బాల్కొండ మండల టిఆర్ఎస్ అధ్యక్షులు ప్రవీణ్ రెడ్డి, సర్పంచ్ రామరాజు గౌడ్ పాల్గొన్నారు.

## దశదిన కర్మకు హజరైన మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోడి అమరేందర్ యాదవ్





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గ ప్రతినిధి-వల్లెపోగు రాము) అశ్వాపురం సెప్టెంబర్ 28:-** ఈరోజు మండల పరిధిలో మల్లెలమడుగు గ్రామ పంచాయతీకి చెందిన చుంచు సత్యం దశదిన కర్మలో పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించిన....మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోడి అమరేందర్ యాదవ్,ఉప సర్పంచ్ గాడిద మహేష్,మాజీ ఉప సర్పంచ్ కమటం ఎల్లయ్య,తూము రాఘవులు,కోడి గంగన్న,గొడుగు నాగేశ్వరరావు,మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుంపెన శ్రీనివాస్,ఏజూఎ పార్టీ నాయకుడు బొమ్మరతి రామయ్య,టీడీపీ నాయకుడు చావ శ్రీనివాస్ రావు,మంగళగిరి రామకృష్ణ,రెడ్డిరాజులు శ్రీకాంత్,గుంజాల శంకర్,ఈసంపల్లి సురేష్ తదితరులు పాల్గొనారులి

## భీమారం లో కుక్కలు, కోతుల బెడద ను తగ్గించండి, ప్రజావాణిలో ఫిర్యాదు



**పోరు తెలంగాణ మంచిర్యాల జిల్లా, సెప్టెంబర్ 28 :** భీమారం మండల కేంద్రంలో కుక్కలు, కోతుల బెడద ను తగ్గించాలని గ్రామ యువకులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కొన్ని రోజులుగా కుక్కలు, కోతులు ప్రజలపై దాడి చేసి గాయపరుస్తున్నాయని తెలిపారు. వాటి తీవ్రత పెరగడంతో వృద్ధులు, చిన్నారులు బయటకు వెళ్లేందుకు భయపడుతున్నారని పేర్కొన్నారు. ఆదివారం పిచ్చికుక్క దాడిలో తొమ్మిది మంది గాయపడినట్లు తెలిపారు. అధికారులు స్పందించి వాటిని తరలించే చర్యలు చేపట్టాలని కోరారు.

## మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఈ నెల 30న సింగరేణి బకాయి బిజెపి లడాయి ధర్నా కార్యక్రమం

### విజయవంతం చేయాలని బిజెపి నాయకులు పిలుపు.



**పోరు తెలంగాణ మంచిర్యాల జిల్లా సెప్టెంబర్ 28 :** ఈ నెల 30వ తేదీన మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరిగే సింగరేణి బకాయి-బిజెపి లడాయి ధర్నా కార్యకమాన్ని విజయవంతం చేయాలని జిల్లా బిజెపి నాయకులు కోరారు ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దుర్గం అశోక్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఏతం శివకృష్ణ జిల్లా నాయకులతో కలిసి చెన్నూరు నియోజకవర్గం లోని వివిధ సింగారేణి మైన్స్ లలో కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ సింగరేణి కార్మికులు సానుకూలంగా స్పందించారని తెలిపారు

# మానవత్వం చాటిన గర్మిళ్ల వాకర్స్

అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారికి రూ.21 వేల ఆర్థిక సాయం.





**పోరు తెలంగాణ మంచిర్యాల సెప్టెంబర్ 28 :** ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడంలో గర్మిళ్ల వాకర్స్ సంక్షేమ సంఘం మరోసారి తమ పెద్ద మనసు చాటుకుంది. మంచిర్యాల ఫ్లైఓవర్ సమీపంలో చిన్న టీ దుకాణం నడిపించుకుంటూ జీవనం సాగిస్తున్న శ్రీనివాస్ కుమారుడు శివనారాయణకు మెదడు సంబంధిత ( బ్రెయిన్ స్ట్రోక్ )తీవ్ర అనారోగ్యం సోకింది. చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారి విషయం తెలుసుకున్న వాకర్స్ సంఘ సభ్యులు వెంటనే స్పందించారు. సభ్యులంతా కలిసి రూ. 21 వేల నగదును ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం కుటుంబానికి అందజేశారు. ఆపద సమయంలో ఆదుకున్న వాకర్స్ సభ్యులకు కుటుంబ సభ్యులు, సంఘ పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.

# తెలంగాణ ఉద్యమ కళాకారులంతా ఛలో హైదరాబాద్



**పోరు తెలంగాణ జన్నారం సెప్టెంబర్ 28 :** మంచిర్యాల జిల్లా తెలంగాణ ఉద్యమ ధూం దాం కళాకారులంతా సెప్టెంబర్ 30 నా తరలి రావాలని"ఉద్యమ కారుల సంఘం రాష్ట్ర నాయకులు కొండుకూరి రాజు పిలుపునిచ్చారు,గత 12 సంవత్సరాలనుండి మేము శాంతియుతంగా ఎందరో వీశ్రీఖ లు,వీజూలు మంత్రులను కలిసినా నిమ్మకు నీరేత్తని విధంగా -కాంగ్రెస్ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని అయనా గుర్తుచేసారు,,,నిజమైనా కళాకారులమంతా ఈయల్లా ఎలాంటి పనీ-పాటలేకుండా పూటగడవని విధంగా రోజులు గడుపుతున్నాము,,,ఈ నెల 30 నా చేస్తున్నా రవీంద్ర భారతి ముట్టడి ఐతే ఉద్యోగాలు వచ్చుడా,,,కళాకారులు చచ్చుడా,,ఈ ప్రభుత్వాలు ఇంకా,ఎన్నాళ్ళు ఈ రెండు నాలుకల ధోరణి ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం మాకు ఉద్యోగాలు ఇవ్వకపోతే మేము చేసే ఈ రవీంద్ర భారతి ముట్టడిలో ఎలాంటి ప్రాణ నష్టం కలిగినా ఈ కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని మేము హెచ్చరిస్తున్నాము,,,ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ ధూం దాం కళాకారులు రాష్ట్ర నాయకులు,కొండుకూరి రాజు లింగంపల్లి రాజలింగం ,అవునూరి సత్తయ్య,మర్శకోలా శ్రావణ్,లింగంపెల్లి శ్రావణి,లింగంపెల్లి మనోజ్ కుమార్,గూడ రాజేందర్,కొల్లూరురి రమేష్,తదితరులు పాల్గొన్నారు,,,జై ఉద్యమ కళాకారుడా,,,జై జై నిరుద్యోగ కళాకారుడా,,,

# కానిస్టేబుల్ నుంచి హెడ్ కానిస్టేబుల్గా పదోన్నతి



**భద్రాద్రి కొత్తగూడెం,పోరు తెలంగాణ -పినపాక నియోజవర్గ ప్రతినిధి- వల్లెపోగు రాము)అశ్వాపురం సెప్టెంబర్ 28:-** అశ్వాపురం పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కోర్సా వెంకటేశ్వర్లుకు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి లభించింది. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు చేతుల మీదుగా పదోన్నతి బ్యాడ్జిని అందుకున్నారు. పదోన్నతి పొందిన వెంకటేశ్వర్లును సీఐ ఎల్లయ్య, ఎస్సై రాజేష్, ఏఎస్సైలు రామచంద్రారెడ్డి, సూర్యారావుతో పాటు పోలీస్ సిబ్బంది అభినందించారు. కొత్త బాధ్యతల్లోనూ సమర్థవంతంగా విధులు నిర్వహించి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## ఆదర్శ రైతుకి బహుమతిగా చార్జింగ్ పంపు అందజేసిన పెట్రోల్ బంక్ యజమాని






**బూర్గంపాడు సెప్టెంబర్ 28 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** బూర్గంపహడ్ మండలం లక్ష్మీపురం గ్రామంలో ఉన్నటువంటి ఇండియన్ ఆయిల్ బంక్ ఓనర్ ప్రవీణ్ కుమార్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహడ్ మండలంలోని సోంపల్లి గ్రామానికి చెందిన గాదె నర్సిరెడ్డిని ఆదర్శ రైతుగా గుర్తించి వ్యవసాయానికి పనికి వచ్చే చార్జింగ్ పంపు మందు స్ప్రే చేసే ఛార్జింగ్ పంపు బహుమతిగా అందజేశారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిసర ప్రాంతాల్లో రైతులను రైతు వారి పనుల మీద బలోపేతం చేస్తూ పంటను పండించే రైతులకు సూచనలు సలహాలు ఇస్తూ ప్రభుత్వాధికారులచే మన్ననలను పొందుతున్న నర్సిరెడ్డికి పెట్రోల్ బంకు యజమాని బహుమతి ఇవ్వడం చాలా సంతోషకరమని ఆదర్శ రైతు వారికి ధన్యవాదాలు తెలిపారు

# కంటైనర్‌ను ఢీకొట్టిన అడిషనల్ కలెక్టర్ కారు




**కొత్తగూడెం సెప్టెంబర్ 28 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్ ప్రయాణిస్తున్న కారు హైదరాబాదు సమీపంలోఆదివారం ప్రమాదానికి గురైంది. హైదరాబాద్ నుంచి కొత్తగూడెం వస్తుండగా నార్కట్‌పల్లి సమీపంలోని కామినేని ఆస్పత్రి వద్ద ఫ్లైఓవర్‌పై ముందున్న కంటైనర్ యూటర్న్ తీసుకుంటున్న సమయంలో కారు వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో కారు ముందు భాగం దెబ్బతినగా వేణుగోపాల్ సురక్షితంగా బయటపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. దెబ్బతిన్న కారును ఇన్సూరెన్స్ ప్రక్రియ కోసం అక్కడే ఉంచారు. అనంతరం పోలీసులు వేణుగోపాల్‌కు అల్పాహారం ఏర్పాటు చేయగా.. సివిల్ సప్లైస్ అధికారి కారులో ఆయన కొత్తగూడెం బయలుదేరి వచ్చారు

# పొనకల్ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ మరియు లయన్స్ క్లబ్ ఆఫ్ జన్నారం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం. 30 మందికి పైగా కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక




**పోరు తెలంగాణ సెప్టెంబర్ 28 జన్నారం ప్రతినిధి :** లయన్స్ క్లబ్ ఆఫ్ జన్నారం ఆధ్వర్యంలో సోమవారం శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు శిబిరానికి హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. లయన్స్ క్లబ్ రీజియన్ చైర్‌పర్సన్ లయన్ జక్కు భూమేష్ ఆధ్వర్యంలో, పొన్కల్ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్సహకారంతో, శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ డా. కస్తూరి సతీష్ కుమార్ మరియు లయన్స్ క్లబ్ ఆఫ్ జన్నారం సభ్యుల సమన్వయంతో ఈ శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో వైద్య బృందం ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి, కంటి శుక్లాలు (ఝుకుతీఖుమ్) తదితర సమస్యలను గుర్తించింది. పరీక్షల అనంతరం 30 మందికి పైగా అవసరమైన రోగులను ఉచిత కంటి శస్త్రచికిత్సల కోసం కరీంనగర్‌లోని రేకుర్తి ఐ హాస్పిటల్‌కు పంపించే ఏర్పాట్లు చేశారు. శస్త్రచికిత్సకు వెళ్లే రోగులకు అవసరమైన ఉచిత భోజనం, వసతి సౌకర్యాలను కూడా కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా రీజియన్ చైర్‌పర్సన్ జక్కు భూమేష్ మాట్లాడుతూ, కంటి సమస్యలతో బాధపడుతున్న పేదలు, అవసరమైన ప్రజలకు ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అవసరమైన చికిత్స పొందాలని సూచించారు. జన్నారం మండలంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఉచిత వైద్య సేవలను అందించేందుకు ముందుకు వచ్చిన లయన్స్ క్లబ్ సభ్యులు, వైద్య బృందం మరియు సహకరించిన నిర్వాహకులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో రీజియన్ చైర్‌పర్సన్ జక్కు భూమేష్, రీజియన్ సెక్రెటరీ కస్తూరి సతీష్ కుమార్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ బందారి మారుతి రాజు, సెక్రెటరీ గోలి రాము, ఇజ సభ్యులు అంజుతరావు, మల్యాల బాబు, నరేంద్రుల గోపి, పొన్కల్ ఉప సర్పంచ్ అప్పాల జలపతి, పొన్కల్ వార్డు సభ్యులుతదితరులు పాల్గొన్నారు.

# బ్రహ్మశ్రీ డాక్టర్ నాగుల సత్యం గౌడ్ కు జాతీయస్థాయి విశ్వ కళ విభూషణ్ పురస్కార ప్రధానం




**పోరు తెలంగాణ హనుమకొండ సెప్టెంబర్ 28 :** మానవ విలువల పరిరక్షణ జాతీయ అధ్యక్షులు, ప్రజాకవి రచయిత వ్యక్తిత్వ వికాస నిపుణులు, అంతర్జాతీయ స్థాయి వరల్డ్ రికార్డ్ అవార్డు గ్రహీత, యూనివర్సల్ బుక్ ఆఫ్ రికార్డ్ అవార్డు గ్రహీత తత్వవేత్త బ్రహ్మశ్రీ ఆధ్యాత్మిక విశ్వ గురువు డాక్టర్ నాగుల సత్యం గౌడ్ సామాజిక సేవలు, రచనలు వారి ఆధ్యాత్మిక సేవలను ... తెలుగు వెలుగు సాహితీ వేదిక, మరియు తెలుగు ఇండియన్ కల్చరల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, శ్రీ విరాట్ విశ్వకర్మ విజ్ఞాన ఆధ్యాత్మిక ధార్మిక కళాపరిషత్ పలు సంస్థల వ్యవస్థాపకులు పోలోజు రాజకుమార్ సత్యం గౌడ్ సేవలను గుర్తించి ... వీరిని , అంతర్జాతీయ స్థాయి విశ్వ కళ విభీషణ్ అవార్డుకు ఎంపిక చేసి, ఈ యొక్క అవార్డును హనుమకొండ బస్టాండ్ పద్మాక్షి ఆవరణలో గల జయకృష్ణ హాస్పిటల్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన ఆ సంస్థల వ్యవస్థాపకులు పోలోజు రాజకుమార్ తో పాటు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలు గా వచ్చిన విశ్వ కళ విరాట్ డాక్టర్ వంగల శాంతి కృష్ణ చార్య ప్రపంచ వరల్డ్ రికార్డు అవార్డు గ్రహీత, ప్రముఖ హాస్య నటులు ఆర్ఎస్ నంద, ప్రముఖ సినిమా నటి నువ్వు ముఖర్జీ వివిధ సంస్థల అధ్యక్షులు సామాజికవేత్త వనపర్తి పద్మజ, సామాజికవేత్త మల్లికార్జున్, సాజనాటి గుంటుక రాధిక, ప్రముఖ న్యాయవాది ఏ కిరణ్ కుమార్, సామాజిక సేవకులు ఎడిటర్ కరీంనగర్ భూమి తెలుగు దినపత్రిక బిడ్డల ప్రశాంత్,వివిధ సంస్థల వ్యవస్థాపకులు వలబోజు మోహన్ రావు, పాడిశెట్టి విష్ణువర్ధన్, అడ్డంకి నాగరాజు, సకల కళా రత్న అక్కనపల్లి యాదగిరి గౌడ్, తదితర ప్రముఖులు సత్యం గౌడ్ కు పట్టు శాల కప్పి, మెడల్ మరియు గురు కిరీటమును ధరింపజేసి జ్ఞాపకను అందజేసి, జాతీయ స్థాయి విశ్వ కళ విభూషణ్ అవార్డును ప్రధానం చేసి, ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వివిధ సంస్థల వ్యవస్థాపకులు పోలోజు రాజ్ కుమార్ తో పాటు ఈ కార్యక్రమానికి వచ్చిన ముఖ్య అతిథిలు మాట్లాడుతూ... సత్యం గౌడ్ ఆధ్యాత్మిక సేవలు, వారి రచనలు సామాజిక సేవలు, వెలకట్టని విలువలన్నారు. ఇంతటి అపార జ్ఞానం కలిగిన సత్యం గౌడ్ దైవాంశ సంభూతులన్నారు. ఇంతటి ఆధ్యాత్మికంగా మనం ఏర్పరచుకున్న విలువలపై అనార్ఘళంగా మాట్లాడే శక్తి కలిగిన సత్యం గౌడ్ సమాజానికి ఎంతో ఉపయోగపడటం అభినందనీయం అన్నారు. అనంతరం ఆధ్యాత్మిక విశ్వగురువు సత్యంగౌడు మాట్లాడుతూ ... ప్రతి ఒక్కరూ మనసును అదుపులో పెట్టుకొని, మనసు నిర్మలం పరుచుకొని ప్రశాంతముగా బ్రతకాలి అన్నారు. ఎందరో కళాకారులను, ఆర్టిస్టులను నృత్య కళాకారులను కవులను రచయితలను సామాజిక వేత్తలను ప్రోత్సహిస్తూ ..వారిని ఆదరిస్తూ వారిలో ఉన్న ప్రతిభను బయటికి తీసి ఎందరికో వారి సంస్థల పక్షాన అవార్డులు రివార్డులు సత్కారాలు అందజేసి తనదైన శైలిలో పోలోజు రాజ్ కుమార్ గారు చేస్తున్న వారి సేవలు అపారమన్నారు. మనుషులు ఒకరికి ఒకరు నష్టం చేసుకోకుండా మనిషి మనిషికి సహకరించే దృక్పథాన్ని అలవర్చుకొని, ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకొని ప్రశాంతమైన జీవితాన్ని గడపాలన్నారు. మనిషి జన్మలో మనిషికి మహోన్నతమైన మంచి మనసు ఉంటుందని, ఆ యొక్క మనసును సత్ప్రయోజనాలకు, సేవా భావాలకు ఆదర్శప్రాయంగా మెదులుతూ, మనం ఏర్పరచుకున్న మంచి మానవత్వాన్ని కాపాడుకుంటూ, ఆదర్శవంతంగా జీవించలనున్నారు. సమాజాని, కిదేశానికి మూల స్తంభాలాంటి వారు నేటి యువత విద్యార్థులేనని, ఇందుకు ప్రతి విద్యార్థి ప్రయోజకుడుగా ఎదిగి నవ సమాజ నిర్మాణానికి పునాదిగా నిలవాలన్నారు. విద్యార్థులు యువత చెడు వేసినాలకు దూరంగా ఉండి దేశ అభివృద్ధికి తోడ్పడుతూ, సమాజ సేవలో భాగస్వాములు కావాలని సత్యం గౌడ్ పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు అంటరాని స్వార్థాన్ని వదులుకొని లోక కళ్యాణంలో భాగస్వాములు కావాలని సత్యంగాడు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంస్థల వ్యవస్థాపకులు, సామాజికవేత్తలు గురువులు, కళాకారులు, కవులు రచయితలు డాన్స్ మాస్టర్లు, టీవీ సీరియల్ ఆర్టిస్టులు, నటులు నృత్య కళాకారులు వారి యొక్క పేరెంట్సుదితరులు పాల్గొన్నారు.

# శంకుస్థాపనకే పరిమితమైన ఆర్‌అండ్‌బీ రోడ్డు

### రూ.1.98 కోట్ల నిధులు మంజూరైనా.. నామమాత్రం పనులు చేసి వదిలేశారు.

### నిధుల కొరతన లేక! .కాంట్రాక్ట్ నిర్లక్ష్యమా!




**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** ఓదెల మండల కేంద్రంలో కొమిర ఓదెల మధ్యలో ఉన్న రైస్ మిల్లు నుండి డి 86 కెనాల్ నుండి జీలకుంట భీమరిపల్లి ఆర్ అండ్ బి రోడ్డు వరకు భారీ నిధులతో శంకుస్థాపన చేసిన ముందుకు సాగడం లేదు ఎంపీటీసీ ఎన్నికలు అనగానే భారీ యంత్రాలతో కాల్వ వెంట ఉన్న మట్టిని పూర్తిగా తొలగించి బొందల గడ్డగా తయారు చేసిన వైనం మళ్లీ ఇప్పటివరకు దాని పురోగతి కనిపించకపోవడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి నిధుల కొరతన కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా!

**అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం**

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి హడావుడి చేయడం తప్ప.. పనులు పూర్తి చేయడంలో అధికారులు, పాలకులు చొరవ చూపడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓదెల మండలంలోని డి-86 ఓదెల రైస్‌మిల్లు నుంచి జీలకుంట మెయిన్ రోడ్డు వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి 2025 జనవరిలో సి ఆర్ ఆర్ 2023, 24 గ్రాంట్రూ.1.98 కోట్ల నిధులతో శంకుస్థాపన చేసి పనులు చేపట్టాలని నిర్ణయించారు. అయితే ఏడాదిన్నరకు చేరువవుతున్నా రోడ్డు పనుల్లో ఆశించిన పురోగతి కనిపించకపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. శంకుస్థాపన సమయంలో త్వరలోనే రోడ్డు నిర్మాణం పూర్తవుతుందని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలింది. హ్యాపీగా ఉన్న రహదారిని భారీ ప్రక్రియలతో బొందల నయం చేసి ప్రయాణికులను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారు నిధులు మంజూరై, పనులకు శ్రీకారం చుట్టి ఇంతకాలం గడిచినా రోడ్డు నిర్మాణం ఎందుకు ముందుకు సాగడం లేదన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రజలకు ఉపయోగపడాల్సిన కోట్లాది రూపాయల అభివృద్ధి నిధులు కాగితాలకే పరిమితమయ్యాయా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ రహదారి పరిస్థితి కారణంగా నిత్యం ప్రయాణించే వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఎన్నికల సమయంలో హామీలు, శంకుస్థాపనలతో హడావుడి చేసే పాలకులు.. ఆ తర్వాత పనుల పురోగతిని పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే కోట్లాది రూపాయల నిధులు మంజూరైనా తమకు ప్రయోజనం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

# రోడ్డు ప్రమాద స్థలాన్ని పరిశీలించిన రామగుండం పోలీస్ కమిషనర్





**పోరు తెలంగాణ మంచిర్యాల సెప్టెంబర్ 28 :** రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలోని సీసీసీ నస్పూర్ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాద స్థలాన్ని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్,ఏసీపీ ఆర్.ప్రకాష్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాద స్థలంలోని రహదారి పరిస్థితులు,డివైడర్ తదితర అంశాలను పరిశీలించారు.ఈ సందర్భంగా సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ,సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదం అత్యంత బాధాకరమైన సంఘటన అన్నారు. ప్రాథమికంగా అందుబాటులో ఉన్న సీసీటీవీ దృశ్యాలను పరిశీలించిన మేరకు ఆటో రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తూ, ఎదురుగా వచ్చిన టిప్పర్‌ను ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోందన్నారు. ఈ ప్రమాదంలో ఇప్పటికే ముగ్గురు మృతి చెందడం అత్యంత విషాదకరమని, మృతుల్లో ఎక్కువగా మహిళలు ఉన్నట్లు ప్రాథమికంగా తెలుస్తోందన్నారు. వారు తమ పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం ఉందన్నారు. ప్రమాద స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించామని తెలిపారు. రహదారి మధ్యలోని డివైడర్‌లో ఉన్న ఖాళీ ద్వారా వాహనాలు అక్రమంగా మలుపు తిరిగే అవకాశం ఉన్నట్లు గుర్తించామని సీపీ తెలిపారు.ఈ ప్రాంతాన్ని ప్రమాదకర ప్రాంతంగా గుర్తించి, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు చేపడతామన్నారు. రహదారిపై అవసరమైన నిర్మాణాత్మక మార్పులు చేయడం, డివైడర్‌లోని ఖాళీని మూసివేయడం, ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించిన చర్యలు చేపట్టడం వంటి అంశాలపై సంబంధిత శాఖలకు ప్రతిపాదనలు పంపించి,వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వారికి అవసరమైన అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించేందుకు పోలీసు శాఖ సిద్ధంగా ఉందన్నారు. తీవ్రంగా గాయపడిన వారిలో కొంతమందిని ఇప్పటికే కరీంనగర్‌కు తరలించామని, మరికొందరు మంచిర్యాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. గాయపడిన వారిని పరామర్శించి, వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందేలా అవసరమైన సహకారం అందిస్తున్నామని చెప్పారు.బాధితులకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందేలా స్థానిక కలెక్టర్‌తో కూడా మాట్లాడి సమన్వయం చేస్తున్నామని సీపీ తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి, అవసరమైన ఇంజినీరింగ్ చర్యలు,ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని సీపీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు.

# విద్యా ప్రమాణాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

**పోరు తెలంగాణ మంచిర్యాల,సెప్టెంబర్ 28, 2026 :** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించడంతో పాటు విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలలో విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతులు, భోజనం, పారిశుద్ధ్యం, వంటశాలలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు తదితర అంశాలను ఆయా జిల్లాల కలెక్టర్లు, నియమిత అధికారులు తరచూ క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేయాలని, విద్యార్థుల లెర్నింగ్ ఔట్‌కమ్స్ మెరుగుపడేలా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం, పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షించాలని, 2027 విద్యా సంవత్సరం నాటికి కనీసం 15 నుంచి 20 పాఠశాలలను పూర్తి చేసేలా చర్యలు వేగవంతం చేయాలని తెలిపారు. విద్యార్థులకు అందించే డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచిన నేపథ్యంలో, పెంచిన సౌకర్యాలు విద్యార్థులకు సక్రమంగా అందేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. పాఠశాలలలో ప్రాథమిక వసతులను అందుబాటులో ఉంచాలని, పారిశుద్ధ్య నిర్వహణ, వంటశాలల పరిశుభ్రత, నాణ్యమైన ఆహార సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఆహార కలుషిత సంఘటనలు, విద్యార్థుల ఆత్మహత్యాయత్నాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ గుర్తింపు వ్యవస్థ (ఎఫ్ ఆర్ ఎస్) ద్వారా హాజరు నమోదును సమర్థవంతంగా అమలు చేయాలని, ఉపాధ్యాయుల హాజరును క్రమం తప్పకుండా సమీక్షించి, ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరయ్యే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని





తెలిపారు. విద్యార్థుల హాజరును కూడా కలెక్టర్లు పర్యవేక్షించి, హాజరు శాతాన్ని పెంచేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. షెడ్యూల్డ్ కులాలు, గిరిజన, వెనుకబడిన తరగతులు, అల్ప సంఖ్యాక వర్గాలు, సాధారణ సంక్షేమ వసతి గృహాలకు సంబంధించి మౌలిక వసతులు, విద్యార్థుల హాజరు, భోజనం, పారిశుద్ధ్యం, ఇతర సౌకర్యాలు, చేపడుతున్న చర్యలను ఒకే సమగ్ర మానిటరింగ్ పోర్టల్ ద్వారా పర్యవేక్షించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. నిర్మాణంలో ఉన్న కేంద్రీకృత వంటశాలల పనులను వేగవంతం చేసి, నవంబర్ మధ్య నాటికి కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థుల యూనిఫారాల తయారీ ప్రక్రియను వేగవంతం చేసి, అక్టోబర్ 20వ తేదీ నాటికి ప్రస్తుత యూనిఫారాల తయారీ పూర్తి చేయాలని, వచ్చే విద్యా సంవత్సరానికి అవసరమైన యూనిఫారాలను వచ్చే ఏడాది మే 30 నాటికి సిద్ధం చేసేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలలోని కంప్యూటర్ ల్యాబ్‌లను సమీక్షించి, విద్యార్థుల విద్యాభ్యాసానికి పూర్తిస్థాయిలో వినియోగించేలా చూడాలని తెలిపారు. యు – డైస్ డేటాలో సుమారు 70--80 వేల మంది విద్యార్థులు డ్రాప్ బాక్స్ లో ఉన్న నేపథ్యంలో, సంబంధిత వివరాలను పరిశీలించి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలని తెలిపారు. సమగ్ర శిక్ష, ప్రధానమంత్రి శ్రీ కార్యక్రమాల క్రింద మంజూరైన నిధుల వినియోగాన్ని సమీక్షించి, నిధులు నిర్దేశిత ప్రయోజనాలకు సక్రమంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులు తరచూ పాఠశాలలు, కళాశాలలను సందర్శించి క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని, వంటశాలల పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యత, సరఫరా, విద్యార్థుల సౌకర్యాలను స్వయంగా పరిశీలించాలని తెలిపారు. ప్రభుత్వ విద్య, సంక్షేమ కార్యక్రమాల ద్వారా జరుగుతున్న మంచి పనులను ప్రజలకు తెలియజేసేలా సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో విద్యావ్యవస్థను పటిష్టం చేసే విధంగా అధికారులతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలలో ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను ప్రజలకు వివరించి విద్యార్థుల తల్లిదండ్రులలో నమ్మకం కల్పించి ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ వసతి గృహాలను అధికారుల సమన్వయంతో తరచుగా ఆకస్మిక తనిఖీలు చేపట్టి విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను పర్యవేక్షించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు

## మంజూరు చేయాలి

## సారపాక బూర్గంపాడు రోడ్డు మరమ్మత్తులను చేపట్టాలి

## ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన సిపిఎం బృందం

**బూర్గంపాడు: సెప్టెంబర్ 28 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు** : అర్హులైన పేదలకు రెండో విడతలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, పెండింగ్లో ఉన్న బిల్లులను వెంటనే మంజూరు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటే శ్వర్లు ఆధ్వర్యంలో బృందం ఫిర్యాదు చేశారు సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో జమాల్ రెడ్డి కి ప్రజా వాణిలో సిపిఎం బృందం పలు సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటే శ్వర్లు మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ ఇండ్లు మం జూరు చేయాలని ఆయన అన్నారు. పెండిం గ్లో ఉన్న



ఇందిరమ్మ ఇండ్ల బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఆయన అన్నారు. సార పాక -బూర్గంపాడు గ్రామాల మధ్య రహదారి పూర్తిగా గోదావరి వరదలు , అకాల వర్షాలతో పాడైపోయిందని ఆయన అన్నారు. ద్విచక్ర వాహనదారులు ప్రజలు ఈ రహదారిపై ప్రయా ణం చేయాలంటే అరచేతిలో ప్రాణాలను పెట్టు కొని ప్రయాణం చేస్తున్నారని పేర్కొన్నారు. తక్ష ణమే ఈ రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం నిధులు కేటాయించి పనులను చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కళ్యాణ లక్ష్మి పథ కాలలో పెండింగ్లో ఉన్న బిల్లులను వెంటనే వి దుదల చేయాలని ఆయన అన్నారు. వృద్ధాప్య పింఛన్లు,వితంతు పింఛన్లు, వికలాంగుల పింఛన్లు కొత్తవి త్వరగా మంజూరు చేయాలని ఆయన అన్నారు. ప్రభు త్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల మేరకు పింఛన్లను వెంటనే పెంపు చేయాలని ఆయన అన్నారు. ప్రధానంగా సారపాక -బూర్గంపాడు గ్రామాల మధ్య ఉన్న రహదారి పూర్తిగా పాడైపోవడం వల్ల ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే ఈ రోడ్డు మరమ్మ త్తులపై ప్రభుత్వం దృష్టి నిలపాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, పార్టీ నాయ కులు బి రాము, కె.ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

## యువతే దేశ భవిష్యత్!

## తిర్యాణి జీజేసీలో 'నిషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్' అవగాహన కార్యక్రమం....

## విద్యార్థులతో ప్రతిజ్ఞ....

## డ్రగ్స్ దుష్ప్రభావాలపై వివరించిన ఎస్ఐ సుబ్బారావు, డాక్టర్ కౌటిల్య....

**పోరు తెలంగాణ సెప్టెంబర్ 28: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని వక్తలు పిలుపునిచ్చారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం 'నిషా ముక్త్ యువ -- ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో "మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటాం, డ్రగ్స్ వినియోగాన్ని వ్యతిరేకిస్తాం" అంటూ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక ఎస్ఐ సుబ్బారావు, డాక్టర్ కౌటిల్య మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వల్ల ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా, చదువు, కుటుంబ జీవితం, భవిష్యత్తు కూడా నాశనమవుతాయని హెచ్చరించారు. యువత డ్రగ్స్ వైపు ఆకర్షితులు కాకుండా అప్రమత్తంగా ఉండాలని, చెడు స్నేహాలకు, వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఎవరైనా



మాదకద్రవ్యాల బారిన పడినట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ జి. అనిల్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ భారీ నిరసన

## ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై అభ్యంతరాలు.. ఎన్నికల సంఘం తీరుపై కాంగ్రెస్ ఆగ్రహం..

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ; సెప్టెంబర్ 28 (పోరు తెలంగాణ న్యూస్) :** ఓటు హక్కు పరిరక్షణ, పారదర్శకమైన ఓటర్ల జాబితా కోసం కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఏఐసీసీ, టిపిసిసి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మహమ్మద్ ఇలియాస్, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, డి సి సి అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ తదితరులు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ ఎన్నికల సంఘం తీరుపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియకు సంబంధించిన అంశాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సి ఈ సి జ్ఞానేష్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని, ఆయనపై విచారణ జరిపి అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సి ఈ సి జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ



దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన తెలిపారు.

**కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ..**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎన్నికల సంఘంపై ప్రభావం చూపుతున్నారని ఆరోపించారు. తమకు అనుకూలమైన ఓట్లను కొనసాగిస్తూ, వ్యతిరేకంగా ఉన్న ఓట్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించారని వారు ఆరోపించారు. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియ అనంతరం ఎన్నికలు జరిగిన రాష్ట్రాల్లో తిరిగి ఎన్నికలు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడిందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా, ప్రతి అర్హుడి ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. భారీ నిరసన కార్యక్రమం అనంతరం కాంగ్రెస్ నాయకులు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఓటు హక్కు పరిరక్షణ, ఓటర్ల జాబితాలో పారదర్శకత, ఎస్ ఐ ఆర్ ప్రక్రియకు సంబంధించిన తమ అభ్యంతరాలు, డిమాండ్లను కలెక్టర్‌కు వివరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి అర్హుడి ఓటు హక్కు రక్షించబడేలా చర్యలు తీసుకోవాలని, ఓటర్ల జాబితాలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని వారు కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, మాజీ డి సి సి అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, కామారెడ్డి టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు ఐరేని సందీప్ కుమార్, పండ్ల రాజు తదితరులు పాల్గొన్నారు. వారితో పాటు వివిధ కాంగ్రెస్ సెల్‌ల అధ్యక్షులు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# జాతీయ స్థాయి కరాటేలో పోత్కపల్లి విద్యార్థినిలు

## గ్రాండ్ మాస్టర్ కొండిల్ల సదానందం







**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** హనుమకొండ జిల్లా కాజీపేటలోని ఏజీఆర్ గార్డెన్స్, బట్టుపల్లిలో ఈనెల 27 ఆదివారం నిర్వహించిన నేషనల్ లెవెల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్--2026 పోటీల్లో పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పోత్కపల్లి పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ విద్యార్థినులు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనగా, పోత్కపల్లి పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. అండర్-14 వెపన్ డబుల్ నాంచక్ కటాస్ విభాగంలో కందుల అమూల్య అద్భుత ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించింది. అదేవిధంగా అండర్-14 కటాస్ విభాగంలో ఎర్ర అస్మిత గోల్డ్ మెడల్, గంగారపు కీర్తి సిల్వర్ మెడల్ సాధించి పాఠశాలకు, మండలానికి, జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా విజేత విద్యార్థినులకు మండల విద్యాధికారి వై. రమేష్ చేతుల మీదుగా బహుమతులు అందజేసి ఘనంగా అభినందించారు.. విద్యార్థినులకు క్రమశిక్షణతో కూడిన శిక్షణ అందించి, పోటీలకు సిద్ధం చేసిన గ్రాండ్ మాస్టర్ సదానందం సేవలను ప్రశంసించారు. ఈ విజయంతో పాఠశాలలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. విద్యార్థినులకు ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

# చలో సిరిసిల్ల సీఎం రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభ

## కామారెడ్డి నియోజకవర్గ కార్యాలయంలో పోస్టర్ల ఆవిష్కరణ..



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ; సెప్టెంబర్ 28 (పోరు తెలంగాణ న్యూస్);** ఈ నెల 30వ తేదీన సిరిసిల్లలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ రూపొందించిన "చలో సిరిసిల్ల" పోస్టర్లను సోమవారం కామారెడ్డి పట్టణంలోని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఐరేని సందీప్ కుమార్, డీసీసీ ఉపాధ్యక్షుడు పండ్ల రాజు పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్న సిరిసిల్ల బహిరంగ సభకు కామారెడ్డి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివెళ్లి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని చలో సిరిసిల్ల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు గంప ప్రసాద్, నౌసీ నాయక్, అజ్మత్, దేవిడ్, ఖదీర్, ఆనంద్ రెడ్డి, కిషన్ రావు పంతులు, లక్కపతిని గంగాధర్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్మూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల(బాలుర)లో "నషాముక్తుభారత్" కార్యక్రమం నిర్వహణ



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** ఆర్మూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలుర)లో "నశాముక్త్ భారత్" కార్యక్రమంలో నిర్వహించారు. ప్రిన్సిపల్ సుభాష్ ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డీ వై. డీ ఎమ్ఢ హెచ్ ఓ రవీందర్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, అబ్దుల్ కలాంని ఆదర్శంగా తీసుకోవాలని, బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని కోరారు.మత్తు పదార్థాల వల్ల కలిగే అనార్థాలను గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ సుభాష్ మాట్లాడుతూ మత్తు పదార్థాల నుండి విద్యార్థులు, యువత విముక్తి చెందాలని, వాటి వల్ల తాత్కాలిక ఆనందం పొందడం ఆరోగ్యానికి హానికరమని తెలిపారు. వాటికి బానిస కాకుండా సరైన అవగాహన చేసుకుని చెడు ప్రభావాలకు బానిస కాకుండా, సరైన మార్గంలో నడిచి మీరు అనుకున్న జీవిత ఆశయానికి చేరువ కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆశన్,హెల్త్ ఆఫీసర్ సాయి,చంద్రశేఖర్, ఫార్మసిస్ట్ వసంత,ఆశ కార్యకర్తలు సుమలత, కమల,అధ్యాపకులు చంద్రశేఖర్, చంద్రమోహన్, రవి, నరేష్, గంగాధర్, శ్రీనివాస్, లక్ష్మణ్, కృష్ణమోహన్, రామకృష్ణ, నికిత, ప్రకాష్, రాజయ్య, రెహమాన్, భూపాల్, భూదేవి, తదితరులు పాల్గొన్నారు.



# మాదిగ మహిళల హక్కుల సాధనే మన ధ్యేయం

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 28 (పోరు తెలంగాణ న్యూస్) కామారెడ్డి, సెప్టెంబర్ 28:** మాదిగ మహిళలు అన్ని రంగాల్లో ఎదుగుతూ, రాజకీయ మరియు సామాజిక పోరాటాల్లో ముందుండాలని మాదిగ మహిళా సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి జిల్లాల ఇంచార్జ్ గుమ్ముట్ల పద్మ పిలుపునిచ్చారు. ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ ఆశీస్సులతో.. మాదిగ మహిళా సమైక్య కామారెడ్డి జిల్లా అధ్యక్షురాలిగా నియమితులైన భానుపురం లావణ్య నియామకాన్ని రాష్ట్ర అధ్యక్షురాలు పెద్ద గీత మాదిగ అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం కామారెడ్డి పట్టణంలో మాదిగ మహిళా సమైక్య ఆధ్వర్యంలో నూతన జిల్లా అధ్యక్షురాలు భానుపురం లావణ్య ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేసిన గుమ్ముట్ల పద్మ మాట్లాడుతూ మాదిగ మహిళల సంక్షేమం, వారి హక్కుల సాధన కోసం సమైక్య నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, దళిత, మాదిగ మహిళలు తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని, సమాజంలో తగిన గౌరవం దక్కేలా ప్రతి ఒక్కరూ సైనికులా పనిచేయాలని కోరారు. నూతన జిల్లా అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన భానుపురం లావణ్య క్షేత్రస్థాయిలో సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ, మహిళల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో కృషి చేస్తారనే పూర్తి నమ్మకం ఉందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ అభినందన సభలో పలువురు మాదిగ మహిళా సమైక్య జిల్లా ఉపాధ్యక్షురాలుసత్తిగారి బుజ్జి,జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామల కార్యదర్శి మహేశ్వరి నాయకురాళ్లు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందరూ కలిసి నూతన అధ్యక్షురాలికి పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.